

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 288 | హైదరాబాద్ | బుధవారం | 25-03-2026 | పేజీలు: 09



## లొంగుబాటుకు సిద్ధమైన మావోయిస్ట్ పాపారావు

మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ

పశ్చిమ బస్తర్ డివిజన్ కమాండర్‌గా ఉన్న పాపారావు

రూ.25 లక్షల రివార్డు కలిగిన అగ్రనేత

మరో 17 మంది అనుచరులు లొంగిపోయే అవకాశం

నేషనల్ పార్క్ అడవుల్లో మధ్యవర్తులతో చర్చలు

బీజాపూర్ ఎస్పీ ఎదుట హాజరయ్యే అవకాశం

ముంచుకొస్తున్న కేంద్రం డెడ్ లైన్ 'మార్చి 31'

నక్సలిజం అంతానికి దగ్గర పడ్డ గడువు

ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ((ప్రజాక్షేత్రం):**

ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో దశాబ్దాలుగా సాగుతున్న సాయుధ పోరాటం ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. మావోయిస్టు పార్టీకి అత్యంత పట్టున్న బస్తర్ ప్రాంతంలో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగలనుంది. ఆ పార్టీలో అత్యంత కీలకమైన పశ్చిమ బస్తర్ డివిజన్ కమాండర్, మోస్ట్ వాంటెడ్ నేత పాపారావు (అలియాస్ సున్నం చంద్రయ్య) పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఆయనపై రూ. 25 లక్షల భారీ రివార్డును ప్రకటించిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా అజ్ఞాతంలో ఉంటూ భద్రతా బలగాలకు సవాలుగా మారిన పాపారావు, ఇప్పుడు తన అనుచరులతో

..మిగతా 2లో

## రాజీనామా చేయడం ఖాయం

### టీపీసీసీ చీఫ్‌కు తేల్చి చెప్పిన జీవన్ రెడ్డి

నేడు తుది నిర్ణయం ప్రకటిస్తానని వెల్లడి

ఫలించని మహేశ్ కుమార్ చర్చలు

కాంగ్రెస్‌తో 40 ఏళ్ల బంధానికి ముగింపు

సమస్యకు పరిష్కారం లేదన్న జీవన్ రెడ్డి

గౌరవం లేకుండా రాజకీయాల్లో కొనసాగలేనని వ్యాఖ్య

రాజీనామా అనంతరం గ్రామాల్లో పర్యటన

జీవన్‌రెడ్డిని ఆపేందుకు

అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు

ఇంటిపై ఇందిరా భవన్

ఫ్లెక్సీ తొలగించిన మాజీ మంత్రి



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పే దిశగా సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టమవుతోంది. పార్టీ మార్పు దాదాపు ఖాయమని సంకేతాలు ఇస్తూ, రేపు ఉదయం 10 గంటలకు తన తుది నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు

..మిగతా 2లో

## పద్దుల పుస్తకాలు ఏవి?

మీరు ఇచ్చేది ఎప్పుడు.. సభ్యులు చదివేది ఎప్పుడు?

10 నిమిషాల టీ బ్రేక్ అని గంటలపాటు వాయిదా

ప్రభుత్వానికి ప్రతిపక్షమంటే కనీస మర్యాద లేదు

మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం

అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

03



## ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్

ఈవీ వాహనాలపై

భారీ రాయితీలు

10 నుంచి 20 శాతం

ఇస్తామన్న మంత్రి పొన్నం

రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ టాక్స్

పూర్తిగా మినహాయింపు

షోరూంలోనే వాహన రిజిస్ట్రేషన్

ఇక ప్రభుత్వ శాఖల్లో

అన్నీ ఈవీ వాహనాలే

కాలుష్య రహిత

నగరంగా హైదరాబాద్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎలక్ట్రిక్ వాహనాలు కొనాలంటే ఇకపై 10 నుంచి 20 శాతం వరకు భారీ డిస్కౌంట్ లభించనుంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణ రక్షణ కోసం తీసుకున్న ఈవీ పాలసీలో భాగంగా ఈ మంచి నిర్ణయం తీసుకుంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని అధికారికంగా

..మిగతా 2లో



## అందరి సహకారంతో హైదరాబాద్ అభివృద్ధి

రూ.16 వేల కోట్లతో అభివృద్ధి పనులు

అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్‌పై అసెంబ్లీలో వాడివేడి చర్చ

నిధుల ఖర్చుపై మాటల యుద్ధం

వచ్చే రెండేళ్లలో

రూ.2,250 కోట్లు ఖర్చుకు హామీ

హెచ్ సిటీ ప్రాజెక్టు కింద 26 కీలక పనులు

49 లింక్ రోడ్లు, 3 భారీ

ఎలివేటెడ్ కారిడార్లకు గ్రీన్ సిగ్నల్

మూసీ అభివృద్ధిపై రాజకీయం వద్దన్న మంత్రి

నగర విస్తరణకు 'ఫ్యూచర్ సిటీ'

ఒక్కటే మార్గమని స్పష్టం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ గుండెకాయ వంటి హైదరాబాద్ మహానగర అభివృద్ధిపై రాష్ట్ర శాసనసభ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు, నిలిచిపోయిన ప్రాజెక్టులు, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలపై బీఆర్ఎస్ సభ్యులు వేసిన ప్రశ్నలకు ప్రభుత్వం తరపున మంత్రి శ్రీధర్ బాబు గట్టిగా బదులిచ్చారు. నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు రూ.16 వేల కోట్లతో బృహత్తర ప్రణాళికలు

..మిగతా 2లో



## దేశ ప్రజలకు మోడీ భరోసా

ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం

భారత్‌పై ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు

**కరోనా తరహాలోనే**

**రంగంలోకి 7 ప్రత్యేక బృందాలు**

నిత్యవసర ధరలపై నిరంతర నిఘా

విదేశాల్లో భారతీయుల రక్షణకు చర్యలు

ఇప్పటి వరకు స్వదేశానికి 3.75 లక్షల మంది

పుష్కలంగా ముడిచమురు నిల్వలు

**పెట్రోలియం సామర్థ్యం**

**65 లక్షల టన్నులకు పెంపు**

పేదలకు అండగా ఉండాలని రాష్ట్రాలకు పిలుపు.



03

## మతం మారితే 'ఎస్సీ' హక్కులు వర్తించవు

సుప్రీం కోర్టు సంచలన తీర్పు

క్రైస్తవంలోకి వెళ్తే రిజర్వేషన్లకు స్వస్తి

అట్రాసిటీ చట్టమూ వర్తించదు

హిందూ, బౌద్ధ,

సిక్కు మతాలకే వర్తింపు

ఏపీ హైకోర్టు ఇచ్చిన

తీర్పును సమర్థించిన సుప్రీం

పాస్టర్ దాఖలు

చేసిన పిటిషన్ కొట్టివేత

క్రైస్తవ మతంలో

కుల వ్యవస్థ లేదన్న కోర్ట్

రాజ్యాంగంలోని 1950

నిబంధన గుర్తు చేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

మత మార్పిడిలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) మంగళవారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత, సదరు వ్యక్తికి షెడ్యూల్డ్ కుల (SC) హోదా వర్తించదని తేల్చి చెప్పింది. కేవలం హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలను

..మిగతా 2లో

## ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్



మొదటిపేజీ తరువాయి

ప్రకటించారు.

**ప్రభుత్వ ఉద్యోగులకు 10-20% డిస్కౌంట్ ప్రకటన**

మహీంద్రా ఎలక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్, ఓలా తదితర ప్రముఖ ఈవీ కంపెనీలు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రాయితీలు ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వంతో ఒప్పందాలు కూడా జరిగాయి. ఉద్యోగులు ఈ డిస్కౌంట్ ద్వారా తక్కువ ధరకు ఎలక్ట్రిక్ కార్లు, బైకులు కొనుగోలు చేయవచ్చు.

**ఈవీ పాలసీలో రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ టాక్స్ 100% మినహాయింపు**

తెలంగాణ ప్రభుత్వం ఈవీ వాహనాలను ప్రోత్సహించడం కోసం రోడ్ టాక్స్ మరియు రిజిస్ట్రేషన్ టాక్స్ పూర్తిగా రద్దు చేసింది. ఇప్పటి వరకు లక్షా 15 వేల 551 ఎలక్ట్రిక్ వాహనాలకు 925.94 కోట్ల రూపాయలు రాయితీలుగా ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇంకా ఎక్కువ మంది ఈవీల వైపు మొగ్గు చూపాలని ప్రభుత్వం ఆశిస్తోంది.

**ఈవీ వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది**

ఈవీ పాలసీ అమలు చేసిన తర్వాత తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం 0.60 శాతం నుంచి 1.50 శాతానికి పెరిగింది. ఇది ప్రభుత్వం తీసుకున్న చర్యలు సక్సెస్ అవుతున్నట్లు సూచిస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సుస్థిర రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా సాంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించాలని స్పష్టం చేశారు.

**సీఎం ఆదేశం: కొత్త వాహనాలు అన్నీ ఈవీలే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే అన్ని ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేసే లేదా అద్దెకు తీసుకునే వాహనాలు ఎలక్ట్రిక్ వాహనాలుగానే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఈవీ వాహనాల వినియోగంలో నార్వే, చైనా లాంటి దేశాలతో పోటీ పడుతుందని ఆయన అన్నారు.

**హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చే లక్ష్యం**

సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. దీనికోసం సుమారు 2 వేల కిలోమీటర్ల మేర కోర్ ఏరియాను ఈవీ ఆధారితంగా మార్చాలని ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్ర జనాభాలో 30 శాతం మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని, కాబట్టి గాలి నాణ్యతను కాపాడటం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

**ఛార్జింగ్ స్టేషన్లు, రెట్రోఫిట్టింగ్ పనులు వేగంగా**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ కోర్ ఏరియాలో ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. డీజిల్ ఆటోలను కూడా ఎలక్ట్రిక్‌గా మార్చే రెట్రోఫిట్టింగ్ ప్రక్రియను త్వరగా చేపట్టనున్నారు. 15 ఏళ్లు దాటిన పాత వాహనాలను స్క్రాపేజీకి పంపించి కొత్త ఈవీలను ప్రోత్సహిస్తున్నారు.

**వాహన రిజిస్ట్రేషన్ ఇక షోరూమ్‌లోనే**

వాహన్ మరియు సారథి పోర్టల్‌ల ద్వారా ఇకపై షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇది ప్రజలకు చాలా సులభంగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలి**

సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులు ఈవీ వాహనాలను పరిశీలించి, వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా ఈవీలను ఉపయోగించి ప్రజలకు ఆదర్శం చూపాలని ప్రభుత్వం కోరుతోంది. ఈ కొత్త చర్యల ద్వారా తెలంగాణలో కాలుష్యం గణనీయంగా తగ్గి, పర్యావరణం మరింత శుభ్రంగా మారాలని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులందరూ ఈ రాయితీలను సద్వినియోగం చేసుకుని ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రాజీనామా చేయడం ఖాయం

మొదటిపేజీ తరువాయి

ఆయన వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో జరిగిన భేటీ తర్వాత జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేశారు. పార్టీ లోపల తన సమస్యలకు పరిష్కారం దొరకలేదని, ఇప్పుడు తన ముందున్న మార్గం స్పష్టంగా లేదని తెలిపారు.

**భేటీ ఫలించలేదు**

జీవన్‌రెడ్డిని ఒప్పించేందుకు కాంగ్రెస్ నాయకత్వం చివరి ప్రయత్నం చేసినా అది ఫలించలేదు. మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు ఏఐసీసీ ప్రతినిధులు ఆయనను కలిసినా, ఆయన తన నిర్ణయంపై వెనక్కి తగ్గలేదు. పార్టీ ఇచ్చిన హామీలు కూడా ఆయనను ప్రభావితం చేయలేకపోయాయి. దీంతో భేటీ ముగిసిన వెంటనే నాయకులు వెళ్లిపోయారు. మూడు రోజుల క్రితమే ఇతర నేతలు కూడా జీవన్‌రెడ్డిని కలసి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కానీ ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. ఈ పరిణామాలన్నింటి తర్వాత ఆయన రాజీనామా నిర్ణయం మరింత బలపడినట్టు కనిపిస్తోంది.

**40 ఏళ్ల అనుబంధానికి ముగింపు**

జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో నాలుగు దశాబ్దాల పాటు కొనసాగిన తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీతో తనకు ఉన్న అనుబంధం ఎంతో బలంగా ఉందని, ఇంతకాలం కలిసి పనిచేసిన తర్వాత ఇప్పుడు విడిపోవడం చాలా బాధగా ఉందన్నారు. రాజకీయ జీవితంలో ఇది తనకు కఠినమైన నిర్ణయమని పేర్కొన్నారు.

**సమస్య పరిష్కారం కాలేదన్న బాధ**

తన సమస్యను పరిష్కరించేందుకు ఎవరూ ముందుకు రాలేదని జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్టీ వద్ద కూడా, తన వద్ద కూడా పరిష్కారం లేకపోయిందన్నారు. సమస్యను తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడడంతోనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు.

**గౌరవం ముఖ్యం అని స్పష్టం**

ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తికి గౌరవం చాలా ముఖ్యమని జీవన్‌రెడ్డి అన్నారు. అది లేకపోతే రాజకీయాల్లో కొనసాగడం కష్టమని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఆయన అసంతృప్తి తీవ్రతను తెలియజేస్తున్నాయి. తనకు వ్యక్తిగతంగా ఎవరి మీదా విరోధం లేదని, కానీ పరిస్థితులు తనను ఈ దిశగా నెట్టాయని చెప్పారు.

**ప్రజల మధ్యకు వెళ్లే యోచన**

రాజీనామా తర్వాత తన నియోజకవర్గ ప్రజలను కలిసి మాట్లాడతానని జీవన్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల ప్రజల అభిప్రాయం తెలుసుకుని తదుపరి రాజకీయ నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తన భవిష్యత్ రాజకీయ ప్రస్థానం ఏ దిశగా సాగుతుందో ఇప్పుడే చెప్పలేనని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ నాయకత్వం స్పందన**

ఇక కాంగ్రెస్ నాయకత్వం మాత్రం జీవన్‌రెడ్డిని పార్టీ విడిచిపెట్టకుండా నిలుపుదల చేయాలని చూస్తోంది. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, జీవన్‌రెడ్డి అనుభవజ్ఞుడైన నాయకుడని కొనియాడారు. కొన్ని రాజకీయ నిర్ణయాలు ఆయనకు ఇబ్బందిగా మారాయని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి పార్టీ మారవద్దని కోరామని, ఆయనపై పార్టీకి ఎంతో గౌరవం ఉందని తెలిపారు. భవిష్యత్‌లో ఆయనకు తగిన గుర్తింపు ఇవ్వడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని చెప్పారు. ఆయన నిర్ణయాన్ని పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

**'ఇందిరా భవన్' ఫ్లెక్సీ తొలగింపు**

ఈ పరిణామాల మధ్య మరో ముఖ్య ఘటన చోటుచేసుకుంది. జీవన్‌రెడ్డి నివాసంపై ఉన్న 'ఇందిరా భవన్' అనే పేరుతో ఉన్న ఫ్లెక్సీని కార్యకర్తలు తొలగించారు. ఇది ఆయన పార్టీతో ఉన్న అనుబంధానికి ప్రతీకగా భావించబడేది. ఇందిరా గాంధీపై అభిమానంతో ఆయన తన ఇంటికి ఆ పేరు పెట్టుకున్నారు. ఇన్నేళ్లుగా అదే పేరుతో పార్టీ కార్యకలాపాలు నిర్వహించారు. ఇప్పుడు ఆ ఫ్లెక్సీ తొలగించడం ద్వారా కాంగ్రెస్‌కు పూర్తిగా గుడ్‌బై చెప్పే సంకేతాలు ఇచ్చినట్టుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**అనుచరుల ఆందోళన**

జీవన్‌రెడ్డి నిర్ణయంపై ఆయన అనుచరుల్లో కలవరం నెలకొంది. కొందరు ఆయన నిర్ణయానికి మద్దతు ఇస్తుండగా, మరికొందరు పునరాలోచించాలని కోరుతున్నారు. అయితే ఆయన మాత్రం తన నిర్ణయంపై కట్టుదిట్టంగా ఉన్నారు.



**భవిష్యత్‌పై అనిశ్చితి**

తన భవిష్యత్ రాజకీయ అడుగులు ఎలా ఉంటాయో జీవన్‌రెడ్డి ఇంకా వెల్లడించలేదు. ఏ పార్టీలో చేరతారు, లేదా స్వతంత్రంగా కొనసాగుతారా అన్నది రేపటి ప్రకటనతో స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆయన 'కాలమే నిర్ణయిస్తుంది' అనే ధోరణిలో ఉన్నారు.

**రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావం**

జీవన్‌రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీ మారితే రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా జగిత్యాల ప్రాంతంలో రాజకీయ సమీకరణాలు మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఇది ఒక పెద్ద దెబ్బగా మారవచ్చని అంటున్నారు.

## లొంగుబాటుకు సిద్ధమైన మావోయిస్ట్ పాపారావు

మొదటిపేజీ తరువాయి

కలిసి జనజీవన స్రవంతిలో కలిసేందుకు మొగ్గు చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుతోంది.

**అడవుల్లో రహస్య చర్చలు.. లొంగుబాటుకు గ్రీన్ సిగ్నల్!**

పాపారావును జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి గత కొంతకాలంగా తెరవెనుక భారీ కసరత్తు జరుగుతోంది. భద్రతా బలగాలు ఒకవైపు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తూనే, మరోవైపు మధ్యవర్తుల ద్వారా లొంగుబాటు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగానే కొందరు మధ్యవర్తులు ఛత్తీస్‌గఢ్‌లోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలోకి వెళ్లి పాపారావుతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ చర్చలు సఫలమవడంతో, పాపారావుతో పాటు సుమారు 12 నుంచి 17 మంది ఆయన అనుచరులు కూడా ఆయుధాలు వదిలి బీజాపూర్ ఎస్పీ ఎదుట లొంగిపోవడానికి సిద్ధపడ్డట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

**కేంద్రం డెడ్ లైన్ - 'ఆపరేషన్ కగార్' పవర్‌ఫుల్ అడుగులు**

దేశంలో నక్సలిజం నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరుకుంది. మార్చి 31వ తేదీ లోపు మావోయిస్టులు లొంగిపోవాలని, లేనిపక్షంలో ఏరివేత తప్పదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈ డెడ్ లైన్ దగ్గర పడుతుండటంతో అడవుల్లో కదలికలు పెరిగాయి. ఇప్పటికే దేవ్ జీ, మల్లోజుల వేణుగోపాల్ వంటి అగ్రనేతలు తమ అనుచరులతో కలిసి పోలీసులకు లొంగిపోగా, ఇప్పుడు పాపారావు కూడా అదే బాట పట్టడం మావోయిస్టు పార్టీకి పెద్ద షాక్ అని చెప్పవచ్చు.

**సీఎం విష్ణుదేవ్ సాయ్ స్పందన: నక్సలిజం అంతం ఖాయం!**

పాపారావు లొంగుబాటు వార్తలపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ, అమిత్ షా నాయకత్వంలో నక్సలిజంపై జరుగుతున్న పోరాటం పతాక స్థాయికి చేరిందని ఆయన అన్నారు. "దేశంలో నక్సలిజాన్ని వేళ్లతో సహా పెకిలించాలన్న దృఢ సంకల్పం ఇప్పుడు ఫలితాలను ఇస్తోంది. పాపారావు వంటి అగ్రశ్రేణి కమాండర్లు లొంగిపోవడం ఒక సానుకూల పరిణామం. బస్తర్ ప్రాంతంలో శాంతి స్థాపనకు ఇది నాంది పలుకుతుంది. నక్సలిజం నిర్మూలనకు గడువు దగ్గర పడింది" అని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

**బలహీనపడుతున్న మావోయిస్టు కోట**

గత రెండేళ్లలో భద్రతా బలగాలు బస్తర్ అడవుల్లో చేపట్టిన వరుస ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు హతమయ్యారు. ముఖ్యంగా డ్రోన్ కెమెరాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు చేస్తున్న గాలింపు చర్యలతో మావోయిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆహారం, మందులు అందక, స్థానిక గిరిజనుల మద్దతు క్రమంగా తగ్గుతుండటంతో అగ్రనేతలు సైతం అజ్ఞాత జీవితాన్ని వదిలి బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పాపారావు వంటి వ్యూహకర్త పార్టీని వీడటం అంటే పశ్చిమ బస్తర్‌లో మావోయిస్టుల ఉనికి దాదాపు కనుమరుగైనట్లేనని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**రాడార్‌లో అగ్రనేతలు.. తదుపరి లక్ష్యం ఎవరు?**

భద్రతా బలగాల రాడార్‌లో ప్రస్తుతం పలువురు అగ్రనేతలు ఉన్నారు. జార్ఖండ్‌కు చెందిన మిసెల్ బెస్రా కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అలాగే తెలంగాణకు చెందిన మావోయిస్టు పార్టీ మాజీ చీఫ్ గణపతి, నరహరి వంటి వారి ఆచూకీ కోసం కూడా గాలింపు ముమ్మరం చేశారు. మార్చి 31లోపు వీరు లొంగిపోతే ప్రభుత్వ పునరావాస పథకాలు అందుతాయని, లేనిపక్షంలో ఎన్‌కౌంటర్లతో ఏరివేయక తప్పదని భద్రతాధికారులు స్పష్టం చేస్తున్నారు. పాపారావు లొంగుబాటు ప్రక్రియ విజయవంతమైతే, మిగిలిన నేతలపై కూడా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

**ముగింపు: శాంతి దిశగా బస్తర్ పయనం**

ఒకప్పుడు తుపాకుల మోతతో దద్దరిల్లిన బస్తర్ అడవులు ఇప్పుడు శాంతిని కోరుకుంటున్నాయి. పాపారావు వంటి కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి రావడం వల్ల అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలగుతాయి. రోడ్ల నిర్మాణం, పాఠశాలలు, ఆసుపత్రుల ఏర్పాటు వేగవంతం అవుతుంది. ప్రభుత్వం కూడా లొంగిపోయిన వారికి మెరుగైన పునరావాసం కల్పిస్తామని హామీ ఇస్తుండటంతో, అజ్ఞాతంలో ఉన్న మరికొందరు యువకులు కూడా బయటకు వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి మార్చి 31 లోపు మావోయిస్టు రహిత భారత్ దిశగా అడుగులు పడుతున్నట్లు కనిపిస్తోంది.

## మతం మారితే 'ఎస్సీ' హక్కులు వర్తించవు



మొదటిపేజీ తరువాయి

ఆచరించే వారిని మాత్రమే ఎస్సీలుగా పరిగణించాలని, ఇతర మతాల్లోకి మారిన వారు ఎస్సీ హోదాను, దాని ద్వారా వచ్చే చట్టబద్ధమైన రక్షణలను కోల్పోతారని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

**ఏపీ హైకోర్టు తీర్పుకు సుప్రీం మొగ్గు**

గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి ఆ మతంలోకి మారిన వారు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు పెట్టే అర్హతను కూడా కోల్పోతారని హైకోర్టు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం, హైకోర్టు నిర్ణయం సరైనదేనని వెల్లడించింది. మతం మారిన వెంటనే ఎస్సీ హోదా తక్షణమే మరియు పూర్తిగా రద్దవుతుందని కోర్టు స్పష్టం చేసింది.

**రాజ్యాంగ నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

రాజ్యాంగంలోని (షెడ్యూల్డ్ కులాలు) 1950 నిబంధనల ప్రకారం.. క్లాజ్ 3లో పేర్కొన్న మతాలు (హిందూ, సిక్కు, బౌద్ధం) కాకుండా వేరే ఏ మతాన్ని ఆచరిస్తున్నా వారిని ఎస్సీలుగా గుర్తించకూడదు. ఈ ఉత్తర్వు కింద ఉన్న నిషేధం పూర్తిగా వర్తిస్తుందని కోర్టు గుర్తించింది. పుట్టుకతో ఒక వ్యక్తి ఏ కులానికి చెందినవారైనా, వారు మతం మారిన క్షణం నుంచి ఎస్సీలకు వర్తించే రిజర్వేషన్లు, చట్టబద్ధమైన ప్రయోజనాలు లేదా అర్హతలను క్లెయిమ్ చేయలేరని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇందులో ఎటువంటి మినహాయింపులు ఉండవని వివరించింది.

**కేసు నేపథ్యం ఏమిటి?**

ఈ కీలక తీర్పు ఒక పాస్టర్ దాఖలు చేసిన పిటిషన్ ద్వారా వెలుగులోకి వచ్చింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి, తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ కొందరిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు పెట్టారు. అయితే, సదరు ఫిర్యాదుదారు ఇప్పటికే క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా కొనసాగుతున్నందున, అతడికి ఎస్సీ హోదా వర్తించదని, కాబట్టి అట్రాసిటీ చట్టం కింద కేసు చెల్లదని నిందితులు కోర్టును ఆశ్రయించారు. ఈ వాదనతో ఏకీభవించిన ఏపీ హైకోర్టు, పాస్టర్ వేసిన ఫిర్యాదును కొట్టివేసింది. దీనిపై సదరు పాస్టర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా అతడికి చుక్కెదురైంది.

**పాస్టర్‌గా ఉన్న వ్యక్తికి రక్షణ ఉండదు**

విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక అంశాలను ప్రస్తావించింది. పిటిషనర్ దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పనిచేస్తున్నారని, క్రమం తప్పకుండా ప్రార్థనలు నిర్వహిస్తున్నారని ఆధారాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. సంఘటన జరిగిన సమయంలో కూడా ఆయన ఒక ఇంట్లో ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు అంగీకరించారు. "పిటిషనర్ క్రైస్తవ మతం నుండి తిరిగి తన పాత మతంలోకి మారినట్లు లేదా ఎస్సీ వర్గం అతడిని తిరిగి స్వీకరించినట్లు ఎక్కడా ఆధారాలు లేవు. ఆయన క్రైస్తవ మతాన్ని కొనసాగిస్తున్నంత కాలం ఆయనను ఎస్సీగా పరిగణించలేం" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

**కుల వ్యవస్థ లేని మతాల్లోకి వెళ్తే అంతే!**

క్రైస్తవం లేదా ఇస్లాం వంటి మతాల్లో కుల వ్యవస్థ లేదని, అందరూ సమానమని ఆ మతాల సిద్ధాంతాలు చెబుతాయి. ఒక వ్యక్తి అంటరానితనం లేదా కుల వివక్ష వంటి సామాజిక ఇబ్బందుల నుంచి బయటపడటానికే ఇతర మతాల్లోకి మారుతారని భావించినప్పుడు, తిరిగి అదే కుల హోదాతో ప్రయోజనాలు పొందాలని కోరుకోవడం చట్టవిరుద్ధమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అందుకే హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు మాత్రమే ఎస్సీ హోదాను పరిమితం చేస్తూ రాజ్యాంగ ఉత్తర్వులు ఉన్నాయని కోర్టు గుర్తు చేసింది.

**రిజర్వేషన్ల ప్రయోజనాలపై స్పష్టత**

ఈ తీర్పు ద్వారా కేవలం ఎస్సీ/ఎస్టీ చట్టం మాత్రమే కాకుండా, విద్య, ఉద్యోగాల్లో వచ్చే రిజర్వేషన్ల పైన కూడా స్పష్టత వచ్చినట్లయింది. ఎస్సీ రిజర్వేషన్లు పొందాలంటే సదరు వ్యక్తి రాజ్యాంగం గుర్తించిన మతాల్లోనే ఉండాలి. ఇతర మతాల్లోకి మారిన వారు బీసీసి వంటి ఇతర వర్గాల కింద ప్రయోజనాలు పొందవచ్చేమో కానీ, ఎస్సీ కోటా కింద అర్హత సాధించలేరు. దీనివల్ల నకిలీ కుల ధృవీకరణ పత్రాలతో ప్రయోజనాలు పొందే మత మార్పిడిదారులకు ఈ తీర్పు ఒక పెద్ద అడ్డంకిగా మారనుంది.

**సర్వత్రా చర్చనీయాంశం**

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మత మార్పిడిలు అధికంగా జరిగే రాష్ట్రాల్లో ఈ తీర్పు ప్రభావం ఎక్కువగా ఉండనుంది. రాజ్యాంగ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, మత స్వేచ్ఛ ఉన్నప్పటికీ దాని వల్ల వచ్చే సామాజిక హోదా మార్పులను కూడా అంగీకరించాలని న్యాయస్థానం పరోక్షంగా సూచించింది. ఇకపై మతం మారిన వారు ఎస్సీలుగా చట్టబద్ధమైన రక్షణ కోరడం సాధ్యం కాదని ఈ తీర్పుతో స్పష్టమైంది.

## అందరి సహకారంతో హైదరాబాద్ అభివృద్ధి



మొదటిపేజీ తరువాయి

సిద్ధం చేశామని, వచ్చే ఎన్నికల నాటికి నగరం రూపురేఖలు మారుస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**అభివృద్ధిపై మంత్రి రోడ్ మ్యాప్**

శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. 'హెచ్‌సిటీ' పథకం కింద రూ.7,032 కోట్ల అంచనాతో 26 పనులను చేపట్టబోతున్నట్లు వివరించారు. వీటితో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు భారీ ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం తెలిపామన్నారు. గత రెండేళ్లలో రూ.122 కోట్లు ఖర్చు చేశామని, రాబోయే 202627 ఆర్థిక సంవత్సరంలో రూ.2,250 కోట్లు వెచ్చించబోతున్నామని స్పష్టం చేశారు. కేవలం అంకెలు కాకుండా, క్షేత్రస్థాయిలో మార్పు కనిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిలదీత**

అయితే, ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఆర్‌డీపీ (SRDP) ద్వారా ఫ్లైఓవర్లు నిర్మించి ట్రాఫిక్‌ను 40 శాతం తగ్గించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల పనులు చేస్తామని చెప్పి, 26 నెలల్లో కేవలం రూ.120 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం అంటే నగరాన్ని నిర్లక్ష్యం చేయడమేనని విమర్శించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఖర్చు వేగం చూస్తుంటే పనులు పూర్తయ్యేసరికి మన వళ్లు వస్తారేమోనని ఎద్దేవా చేశారు. ఈస్ట్‌వెస్ట్ కారిడార్‌ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

**నిలిచిపోయిన పనులు.. సామాన్యుల ఇబ్బందులు**

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నగరంలోని రోడ్ల దుస్థితిని ప్రస్తావించగా, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాత టెండర్ల రద్దుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన పనులను రద్దు చేసి, కొత్త టెండర్ల పేరుతో కాలయాపన చేయడం వల్ల ప్రజలపై భారం పడుతోందని ఆమె విమర్శించారు. జవహర్ నగర్ డంప్ యార్డ్ సమస్యపై మల్లారెడ్డి గళం విప్పారు. ఆ ప్రాంత వాసుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. అలాగే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారికి అధికారిక కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

**మూసీ రాజకీయం వద్దు: మంత్రి శ్రీధర్ బాబు**

బీఆర్ఎస్ సభ్యుల విమర్శలపై మంత్రి శ్రీధర్ బాబు దీటుగా స్పందించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను ఎక్కడా ఆపలేదని, కేవలం ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కొన్ని మార్పులు మాత్రమే చేశామని చెప్పారు. ముఖ్యంగా మూసీ నది అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌కు వలసలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీనిని తట్టుకోవాలంటే నగర విస్తరణ తప్పదని, అందుకే 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రోటోకాల్ విషయంలో గతంలో తమకు జరిగిన అన్యాయాలను గుర్తు చేస్తూ, ఎమ్మెల్యేలతో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**ట్రాఫిక్ కష్టాలకు చెక్.. ఉప్పల్ కారిడార్ అప్డేట్**

నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని అంగీకరించిన మంత్రి, దాని పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేస్తామని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. నగరవ్యాప్తంగా అండర్ పాస్‌లు, సర్ఫేస్ రోడ్ల నిర్మాణం ద్వారా బాటిల్ నెక్స్ సమస్యలను తొలగిస్తామన్నారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో గణనీయమైన పురోగతి కనిపిస్తుందని, మనవళ్ల వరకు చూడాల్సిన అవసరం లేదని సుధీర్ రెడ్డి విమర్శకు కౌంటర్ ఇచ్చారు.

**కేంద్రంపై ఒత్తిడి తేవాలి**

రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ కేవలం ఒక నగరం మాత్రమే కాదని, రాష్ట్ర ఆదాయానికి మూలాధారమని, అందరం కలిసి దీనిని విశ్వనగరంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.

**అభివృద్ధి పథంలో భాగ్యనగరం**

అసెంబ్లీలో జరిగిన ఈ చర్చ ద్వారా హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి, ప్రతిపక్షాల ఆవేదన రెండూ స్పష్టమయ్యాయి. నిధుల కేటాయింపులు, ప్రాజెక్టుల అమలు వేగవంతం అయితేనే భాగ్యనగరవాసులకు ట్రాఫిక్ నరకం నుంచి విముక్తి కలుగుతుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఎన్నికల నాటికి నగరం ఎంతవరకు అద్భుతంగా మారుతుందో వేచి చూడాలి.

# పద్దుల పుస్తకాలు ఏవి?

- మీరు ఇచ్చేది ఎప్పుడు.. సభ్యులు చదివేది ఎప్పుడు?
- 10 నిమిషాల టీ బ్రేక్ అని గంటలపాటు వాయిదా
- ప్రభుత్వానికి ప్రతిపక్షమంటే కనీస మర్యాద లేదు
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

సమయపాలన పాటించకపోవడం, పద్దులకు సంబంధించిన పుస్తకాలు ఇవ్వకపోవడం, క్లారిఫికేషన్ లేకపోవడం పట్ల మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నిరసన వ్యక్తం చేసింది. సభను వాకౌట్ చేసి ఆ పార్టీ సభ్యులు బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మాట్లాడుతూ, శాసన సభ అంటే అధికారులకు లెక్క లేకుండా తయారైందన్నారు. ''బుధవారం పద్దులు ఉన్నాయి ఎజెండాలో మీరే పెట్టిండ్రు. ఇప్పటివరకు ఈ నిమిషానికి కూడా టూరిజం ఆర్ట్స్ అండ్ కల్చర్ పద్దుల బుక్కులు ఇంతవరకు రాలేదు. స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ బుక్స్ ఇవ్వలేదు. మైనార్టీ వెల్ఫేర్ పద్దులు ఇంతవరకు పెట్టలేదు. మీరు ఇప్పటిదాకా పుస్తకాలే వేయకపోతే మెంబర్స్ ఎప్పుడు చదువుకుంటారు. అసెంబ్లీలో ఎప్పుడు మాట్లాడుతారు. అసలు ఆ పద్దు ఏంటో ఏం ప్రతిపాదించారో చదువుకోకుండా ఏ రకంగా మాట్లాడతారు'' అంటూ నిలదీశారు. ఈ ప్రభుత్వానికి శాసనసభ అంటే గౌరవం లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. మంగళవారం ఉదయం కూడా సభ 10 గంటల 6 నిమిషాలకు ప్రారంభం అయిందని, ఏ రోజూ 10 గంటలకు స్టార్ట్ కావడం లేదన్నారు. బ్రేక్ ఫర్ టెన్ మినిట్స్ అంటున్నారని, కొన్ని గంటల తర్వాత గానీ సభను ప్రారంభించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తమ క్లారిఫికేషన్‌కు కూడా టైం ఇవ్వలేదని ఆరోపించారు. తాము సభలో ఎందుకు ఉండాలని పేర్కొన్నారు. వీటన్నిటికీ నిరసనగానే సభ నుంచి వాకౌట్ చేశామని తెలిపారు. తాము వాకౌట్ చేసి బయటికు వచ్చాక అయినా తప్పులు సవరించుకుంటామని ప్రభుత్వం ఒక్క మాటైనా చెప్పలేదన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రతిపక్షమంటే కనీస మర్యాద లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం లోపలికి రావాలని పిలవాలనే సంస్కారం కూడా అధికార పక్షానికి లేకుండా పోయిందని హరీశ్ రావు దుయ్యబట్టారు.

# దేశ ప్రజలకు మోడీ భరోసా

- ఇంధన కొరతపై ప్రధాని మోడీ కీలక ప్రకటన
- ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- భారత్‌పై ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు
- కరోనా తరహాలోనే రంగంలోకి 7 ప్రత్యేక బృందాలు
- నిత్యవసర ధరలపై నిరంతర నిఘా
- విదేశాల్లో భారతీయుల రక్షణకు చర్యలు
- ఇప్పటి వరకు స్వదేశానికి 3.75 లక్షల మంది
- పుష్కలంగా ముడిచమురు నిల్వలు
- పెట్రోలియం సామర్థ్యం 65 లక్షల టన్నులకు పెంపు
- పేదలకు అండగా ఉండాలని రాష్ట్రాలకు పిలుపు.

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్)లో కొనసాగుతున్న యుద్ధ జ్వాలలు ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. ఈ యుద్ధం వల్ల ఏర్పడిన అంతర్జాతీయ ఇంధన సంక్షోభం, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు భారతదేశానికి ఆందోళనకరంగా మారిన మాట వాస్తవమేనని అంగీకరిస్తూనే, దేశ ప్రజలకు ఆయన భారీ భరోసా ఇచ్చారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ముడిచమురు, గ్యాస్ నిల్వలు మన వద్ద పుష్కలంగా ఉన్నాయని ప్రధాని స్పష్టం చేశారు.

**యుద్ధం - ఇంధన సెగ**

పశ్చిమాసియాలో యుద్ధం మొదలై మూడు వారాలు దాటిందని, ఇది ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా గొలుసును దెబ్బతీసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ రవాణా చేసే వాణిజ్య మార్గాలపై యుద్ధ ప్రభావం పడిందని ఆయన వివరించారు. భారత్‌కు అవసరమైన ముడిచమురులో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచే వస్తున్నందున, ప్రస్తుత పరిస్థితులు కొంత ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పారు. అయితే, ఈ ప్రభావం సామాన్యుడిపై పడకుండా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని ఆయన సభకు వివరించారు.

**ఏడు ప్రత్యేక బృందాల ఏర్పాటు**

కరోనా కష్టకాలంలో సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి 'ఎంపవర్డ్ గ్రూప్స్' ఏర్పాటు చేసినట్లుగానే, ప్రస్తుత ఇంధన, ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం ఏడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించిందని ప్రధాని వెల్లడించారు. ఈ గ్రూపులు పెట్రోల్, డీజిల్, ఎరువులు, గ్యాస్ సరఫరాను పర్యవేక్షించడంతో పాటు, మార్కెట్‌లో నిత్యావసర ధరలు పెరగకుండా తక్షణ నిర్ణయాలు తీసుకుంటాయని చెప్పారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో ఈ బృందాలు పనిచేస్తున్నాయని ప్రధాని తెలిపారు.

**వ్యూహాత్మక నిల్వలు - పెరిగిన సామర్థ్యం**

దేశంలో ఇంధన కొరత రాకుండా ప్రభుత్వం గత పదేళ్లుగా తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలను మోదీ గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో భారతదేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వ సామర్థ్యాన్ని సుమారు 53 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని, ఇప్పుడు దానిని 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. భారత రిఫైనరీల సామర్థ్యం కూడా గత దశాబ్ద కాలంలో వేగంగా పెరిగిందని, దేశం వద్ద ప్రస్తుతం సరిపడా ముడిచమురు నిల్వలు ఉన్నాయని ఆయన దేశవ్యాప్తంగా ఉన్న పౌరులకు హామీ ఇచ్చారు.

**విదేశాల్లోని భారతీయుల భద్రతే ముఖ్యం**

గల్ఫ్ దేశాల్లో సుమారు ఒక కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారని, వారి జీవనోపాధి మరియు భద్రత తమ ప్రభుత్వానికి అత్యంత ప్రధానమని ప్రధాని అన్నారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 3.75 లక్షల మందికి పైగా భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తరలించామని వెల్లడించారు. ఇందులో కేవలం ఇరాన్ నుంచే వెయ్యి మందికి పైగా వచ్చారని, అందులో 700 మంది మెడికల్ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని తెలిపారు. హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న భారతీయ సిబ్బంది ఉన్న నౌకలను సురక్షితంగా రప్పించడానికి దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నామని చెప్పారు.

**శాంతి కోసం దౌత్య ప్రయత్నాలు**

యుద్ధం ఏ సమస్యకైనా పరిష్కారం కాదని, కేవలం చర్చలు మరియు సంప్రదింపుల ద్వారానే శాంతి సాధ్యమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా వంటి దేశాల అధినేతలతో తాను నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతున్నానని తెలిపారు. సమస్యకు ఒక చక్కని, శాంతియుత పరిష్కారం కనుగొనాల్సిందిగా అన్ని పక్షాలను కోరుతున్నామని చెప్పారు. భారత్ ఎప్పుడూ శాంతి వైపే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**రాష్ట్రాల సహకారం - బ్లాక్ మార్కెటింగ్‌పై నిఘా**

ప్రస్తుత పరీక్షా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పేదలు, వలస కార్మికులపై యుద్ధ ప్రభావం పడకుండా చూడాలని కోరారు. 'పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన' ప్రయోజనాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చూడాలని రాష్ట్రాలకు సూచించారు. ఇదే తరుణంలో కొందరు స్వార్థపరులు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

**ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం**

పశ్చిమాసియా సంక్షోభం నుంచి ప్రపంచం తేరుకోవడానికి కొంత సమయం పట్టవచ్చని, కానీ భారత్ ఈ ప్రభావాన్ని తట్టుకోగలదని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి అడుగును జాగ్రత్తగా వేస్తోందని చెప్పారు. ఎంతటి క్లిష్ట సమస్యనైనా భారత్ ఐక్యతతో అధిగమిస్తుందని మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.

## మైనర్ బాలిక కు గర్భవతి అని తప్పుడు రిపోర్ట్ నర్సంపేట వేద స్కానింగ్ సెంటర్

**నర్సంపేట మార్చి 24(ప్రజాక్షేత్రం):**

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణం వరంగల్ రోడ్డుకు వేద స్కానింగ్ సెంటర్ లో మైనర్ బాలిక కు గర్భవతి అని రిపోర్ట్ ఇచ్చిన రేడియాలజిస్టు డాక్టర్ సతీష్ గైనకాలజీ చేయవలసిన టెస్టు తానే చేసి గర్భవతి అని నిర్ధారణ అనుమానం వచ్చి వరంగల్ హస్పిటల్ లో పరిక్షలు చేయగా బ్యాడ్ టిస్యూ గా తేల్చిన వైద్యులు. తప్పుడు రిపోర్ట్ ఇచ్చాడని బాలిక కుటుంబ సభ్యులు డాక్టర్ సతీష్ ని నిలదీయగా నా రిపోర్టు కరెక్టేనని డాక్టర అనగా వారి కుటుంబ సభ్యులతో వాగ్దానాన్ని దిగారు



కోప గైతులైన బాలిక కుటుంబ సభ్యులు డాక్టర్ సతీష్ కు దేహశుద్ధి చేశారు.

# సదాశివపేటలో బిఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టులు

- నేటి విద్యావిధానం లో -ఫీజు రియంబర్మెంట్ పై విద్యార్థులు ఆవేదన

**సదాశివపేట టౌన్ మార్చి 24 (ప్రజాక్షేత్రం):**



తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న సంగారెడ్డి నియోజకవర్గ బిఆర్ఎస్వీ అధ్యక్షులు పెద్దగొల్ల శ్రీహరి, మండల అధ్యక్షులు పాండు నాయక్, పట్టణ అధ్యక్షులు రోషన్‌లను పోలీసులు ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసి సదాశివపేట సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలు స్వేచ్ఛగా నిరసనలు తెలపవచ్చని చెప్పినా, ఇలాంటి ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యత" ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత విద్యకు చేరుతారు డ్రాప్‌అవుట్ రేటు (చదువు మానేసే వాళ్లు) తగ్గుతుంది. రాష్ట్రంలో విద్యా స్థాయి పెరుగుతుంది. భవిష్యత్తులో మంచి నైపుణ్యాలతో ఉన్న యువత తయారవుతుంది. పేదరికం తగ్గించడంలో సహాయపడుతుంది. దీర్ఘకాలంలో ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఉపయోగపడుతుంది.నేటి విద్యా విధానంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రి స్వయంగా ముఖ్యమంత్రే అయినప్పటికీ, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, అలాగే హాస్టల్‌లలో విద్యార్థులకు తగిన వసతులు కల్పించి ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది పేద విద్యార్థుల చదువుకు పెద్ద అండ. అది ఆలస్యం అయితేనే ప్రొటెస్టులు జరుగుతాయి.

# సదాశివపేటలో విజిలెన్స్ దాడులు

- హోటళ్లపై అకస్మిక తనిఖీలు
- 22 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

**సదాశివపేట టౌన్ మార్చి 24 (ప్రజాక్షేత్రం):**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సివిల్ సప్లైస్ శాఖ సిబ్బందితో కలిసి మంగళవారం అకస్మిక దాడులు నిర్వహించారు. ఇంటికి ఉపయోగించే సబ్సిడీ LPG గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపులలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో మొత్తం 22 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ వినియోగిస్తున్న ఆరు యజమానులపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

**అధికారులు హెచ్చరిస్తూ:**

సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని, ఇలాంటి చర్యలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**DTCS స్వరూపా మాట్లాడుతూ**

సదాశివపేట పట్టణంలో LPG కొరత ఏమీ లేదని, సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని సూచించారు.

ఈ దాడుల్లో పాల్గొన్న అధికారులు: DSP వెంకటేశం CI పాండరి SI శంభశివ విజిలెన్స్ & సివిల్ సప్లైస్ సిబ్బంది

**ప్రజలకు సూచన:**

గ్యాస్ సిలిండర్లను సరైన విధంగా వినియోగించాలి. అక్రమ వినియోగం గమనించినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.




## నర్సంపేట మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్ల శాంతియుత నిరసన

**నర్సంపేట మార్చి 24(ప్రజాక్షేత్రం):**

వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయం ముందు బిఆర్ఎస్ కౌన్సిలర్ల శాంతియుత నిరసన తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని లో బిఆర్ఎస్ కౌన్సిలర్ శివరాత్రి స్వామి మాట్లాడుతూ అనేకమార్లు కమిషనర్ కు వార్డులో ఎదురవుతున్న సమస్యల గురించి వివరించాం అయినా కమిషనర్ నుండి ఎలాంటి స్పందన లేదు ప్రధానంగా వార్డులో సమస్యలు శానిటైజర్ చెత్త డ్రైనేజీ మిషన్ భగీరథ వాటర్ లీకేజ్ సైడ్ కాలువలు రోడ్లు నిర్మాణం కుక్కలు కోతుల బెడద లో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు పట్టణంలో అనేక సమస్యలు గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం అయినవారు పట్టించుకోవడం లేదు అందుకే ఈరోజు మా పార్టీ బిఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపాలిటీ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్నాం నర్సంపేట మున్సిపాలిటీలో సమస్యల గుర్తించి వాటిని పరిష్కరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కమిషనర్ కి పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలే ప్రధాన జెండాగా పనిచేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిఆర్ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏపీడి లోకేశ్వర్.

**పెద్ద కడబూరు మార్చి 24 (ప్రజాక్షేత్రం):**

పెద్దకడుబూరు మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీ డి లోకేశ్వర్ టెక్నికల్ అసిస్టెంట్ గిడ్డయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు పనుల పురోగతిని పరిశీలించి వేతనా దారులతో మాట్లాడారు వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి అమలు కానున్న" వి బి జి రామ్ జి" పథకం పై కూలీలకు అవగాహన కల్పించాలని కవితకు సూచించారు, ఉపాధి హామీ పథక ప్రయోజనాలను ప్రతి కార్మికుడికి వివరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, బసవరాజు,ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# రాజీ మార్గమే రాజ మార్గం...

- **ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు తక్షణ న్యాయం**
- **కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి – జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్**

**మహబూబ్‌నగర్ జిల్లా మార్చి 24 (ప్రజాక్షేత్రం):**
జిల్లా ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, కోర్టుల పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ ఖర్చుతో, త్వరితగతిన న్యాయం పొందేందుకు ఇది ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి అంశాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకునే మంచి అవకాశం ఇదని, శాంతియుతంగా ఇరు పక్షాల అంగీకారంతో సమస్యలు పరిష్కారం అయ్యే విధానం లోక్ అదాలత్ అని తెలిపారు. కోర్టుల్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్ తెలిపారు.




# హామీల అమలు కోసం ముట్టడికి సిద్ధమైన బీఆర్ఎస్ నాయకుల అరెస్టుపై ఆగ్రహం

**కామారెడ్డి జిల్లా మార్చి 24 (ప్రజాక్షేత్రం):**
కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో బి ఆర్ ఎస్ నాయకులు అరెస్ట్ హామీల అమలు కోసం శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడి చేపట్టాలని నిర్ణయించుకున్న బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం తగదని బాన్సువాడ మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ జుబేర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తెల్లవారు జామున పోలీసులు బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.విద్యానిధులు..ఉద్యోగాలు ఏవి.. ? బీఆర్ఎస్వీ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రవట్టి సాయిబాబా, ఫిరోజ్, ఖలీల్, యువజన నాయకుడు రమేష్ యాదవ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా షేక్ జుబేర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 15 శాతం విద్యా నిధులు, 2 లక్షల ఉద్యోగాలు, విద్యా భరోసా కార్డు, నిరుద్యోగ భృతి, స్కాలర్‌షిప్‌లు, చదువుకుంటున్న విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం విద్యార్థుల్లో ఆగ్రహాన్ని రేకెత్తించిందన్నారు. పోలీసులను ఉపయోగించి విద్యార్థి ఉద్యమాలను అణచివేయాలని రేవంత్ సర్కారు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందని,ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్,బీఆర్ఎస్వీ ఉద్యమం ఆగదని తెలిపారు.




# 28న జాతీయ లోక్ అదాలత్

**కుషాయిగూడ,మార్చి 24(ప్రజాక్షేత్రం):**
తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మల్కాజిగిరి జిల్లా కోర్టు పరిధిలో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టు సముదాయాల్లో ఈ కార్యక్రమం జరుగనుంది. సివిల్, ఫ్యామిలీ, బ్యాంకు రికవరీ, చెక్కు బౌన్స్, భూ వివాదాల కేసులను పరస్పర అవగాహనతో తక్కువ ఖర్చులో పరిష్కరించుకునే అవకాశముందని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.




# కొంపల్లిలో చిరు వ్యాపారస్తుల ఆందోళన "20 ఏళ్ల జీవనాధారంపై బుల్డోజర్ ముప్పు!"

- **జీవనాధారం కోల్పోతామనే భయం... ఆందోళనలో మహిళలు**
- **ఎక్కడికి వెళ్లాలి?"– ఆవేదనలో చిరు వ్యాపార కుటుంబాలు**
- **ప్రత్యామ్నాయం లేకుండా ఖాళీ చేయమంటారా?**

**కుత్బుల్లాపూర్ మార్చి 24 (ప్రజాక్షేత్రం):**
కొంపల్లి మార్కెట్ రోడ్డు, సెంట్రల్ పార్క్ మరియు పరిసర ప్రాంతాల్లో ఉన్న తమ దుకాణాలను మార్కెట్ రోడ్డుపై సాధారణంగా కనిపించే కూరగాయల దుకాణాలు, చిన్న టీ స్టాళ్లు, పండ్ల బండ్లు ఈసారి మాత్రం నిశ్శబ్దంగా కనిపించాయి. అక్కడ వ్యాపారం లేదు... ఆందోళన ఉంది. ఆశ లేదు... ఆవేదన మాత్రమే కనిపించింది.
రేపు ఉదయం 6 గంటల లోపు దుకాణాలు ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు ఇచ్చిన హెచ్చరికతో చిరు వ్యాపారుల జీవితం ఒక్కసారిగా సంక్షోభంలో పడింది. "ఖాళీ చేయండి... లేదంటే మేమే కూల్చేస్తాం" అన్న మాట వాళ్లకు కేవలం నోటీసు కాదు—జీవితంపై పడిన గుద్దులాంటిది.

**"ఇది మా బ్రతుకు... ఎక్కడికి వెళ్లాలి?"**
20 ఏళ్లుగా అదే చోట కూరగాయలు అమ్ముకుంటున్న లక్ష్మమ్మ కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. "ఇక్కడే మా పిల్లలను చదివించాం... ఇక్కడే మా జీవితం. ఒక్కరోజులో వెళ్లిపోమంటే ఎలా?" అని ప్రశ్నించింది.
పక్కనే టీ దుకాణం నడిపే రమేష్ కూడా అదే ఆవేదన వ్యక్తం చేశాడు.
"మున్సిపల్ వాళ్లకైనా, పోలీసులకైనా డబ్బులు ఇచ్చాం. ఇప్పుడు ఒక్కసారిగా వెళ్లమంటున్నారు. ఇది న్యాయమా?" అని ఆవేదన వ్యక్తం చేశాడు.

**అధికారులు అందుబాటులో లేక నిరాశ**
తమ సమస్యను చెప్పుకోవడానికి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన వ్యాపారులకు మరింత నిరాశ ఎదురైంది. కమిషనర్ అందుబాటులో లేరని చెప్పడంతో, తమ గోడును వినే వారే లేరన్న భావన వారిలో మరింత బాధ కలిగించింది.

**కుటుంబాలపై ప్రభావం**
ఈ వ్యాపారాలపై ఆధారపడి ఉన్న వందలాది కుటుంబాలు ఇప్పుడు ఆందోళనలో ఉన్నాయి. పిల్లల చదువు, ఇంటి ఖర్చులు, అప్పులు—అన్ని ఒక్కసారిగా ప్రశ్నార్థకంగా మారాయి.






**ప్రభుత్వ జోక్యం కోరుతున్న వ్యాపారులు**
"మాకు వ్యాపారం చేసుకునే స్థలం చూపించండి... జీవించనివ్వండి" అంటూ వ్యాపారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రత్యామ్నాయ స్థలం లేకుండా ఖాళీ చేయించడం అన్యాయం అని వారు అంటున్నారు.

# కోళ్ల వెంకటేష్ నియామకం

- **దండోరా ఉద్యమ నేతల హర్షం.**

**వనపర్తి,మార్చి 24 (ప్రజాక్షేత్రం):**
దళిత నేతగా,ఉన్నత విద్యావంతుడిగా,చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందిన కోళ్ల వెంకటేష్ ను కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల దండోరా ఉద్యమ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయనను సన్మానిస్తూ మాట్లాడారు. రెండున్నర దశాబ్దాలుగా దండోరా ఉద్యమంలో సేవలందిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆయనకు ఈ పదవి దక్కడం సముచితమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దండోరా ఉద్యమ నేత, మాదిగ ఉద్యోగుల సంఘం అధినేత గంట గట్టయ్య మాదిగ మాట్లాడుతూ, కోళ్ల వెంకటేష్ నియామకం దళిత వర్గాల నాయకత్వానికి ప్రోత్సాహం కలిగించే నిర్ణయమని ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లాల వారీగా, రాష్ట్రాల వారీగా మాదిగ కులానికి చెందిన నాయకులను ముందుకు తీసుకురావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కోళ్ల వెంకటేష్ గారిని ఘనంగా శాలువాలతో సన్మానించి, మిఠాయిలు పంచుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో తగవుల వెంకటస్వామి, రాజారాం ప్రకాష్, గంధం నాగరాజు, దేవన్న నాయుడు, మందడి దశరథం, శివశంకర్, చంద్రశేఖర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ నియామకం ద్వారా వనపర్తి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తోడ్పడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.





# ఘనంగా భగత్ సింగ్ 95వ వర్ధంతి..


**పెద్దకడబూరు మార్చి 24 (ప్రజాక్షేత్రం):**
మండల కేంద్రమైన పెద్దకడబూరు మండలంలోని స్థానిక ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహం నుండి బస్టాండ్ ఆవరణం వరకు మంగళవారం కాగడాల ర్యాలీ నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి. భగత్ సింగ్ 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్యదర్శి తిక్కన్న గౌడ్ మాట్లాడుతూ వలస వాదుల పాలన అంతంకావాలని, భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కోసం ఉద్యమించి, ఉరితాడును మాలగా స్వీకరించి మా జీవితాలు సిద్ధాంతాల కన్నా గొప్పకాదు, బ్రిటిష్ వారిని దేశం నుండి తరిమికొట్టాలని దేశం కోసం ప్రాణాలు అర్పించిన సర్దార్ భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ లు మరణించి నేటికీ 95 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ప్రజల హృదయాల్లో నేటికీ నిలిచిపోయారు నేటి యువత భగత్ సింగ్, రాజు గురు సుఖదేవ్ ల స్ఫూర్తితో ఈ దేశం కోసం, ఈ ప్రజల హక్కుల కోసం, ఈ సంపాదన ఈ దేశ ప్రజలకే చెందే విధంగా మరో పోరాటాలకు సంసిద్ధం కావడమే భగత్ సింగ్, రాజుగురు సుఖదేవులకు నిజమైన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్,ఎస్ఎఫ్ఐ విల్సన్,రాజు, తదితరులు పాల్గొన్నారు

# శుభ్రతపై కాప్రా సర్కిల్ ఫోకస్

- **99 రోజుల ప్రణాళికలో భాగంగా జీవీపీ పాయింట్ల తొలగింపు**

**కాప్రా,మార్చి 24(ప్రజాక్షేత్రం):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో కాప్రా సర్కిల్‌లో అధికారులు చెత్త నిర్మూలనపై దృష్టి సారించారు. చెత్త అధికంగా పేరుకుపోతున్న జీవీపీ పాయింట్లను పూర్తిగా తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న జీవీపీ పాయింట్ల వద్ద చెత్తను ఎత్తివేసి పరిసరాలను శుభ్రం చేశారు. చెత్త వేయడానికి అవకాశం ఉన్న ఇళ్లు, దుకాణాలను గుర్తించి స్వచ్ఛ ఆటో సేవలతో అనుసంధానం చేసి రోజువారీ చెత్త సేకరణకు చర్యలు తీసుకున్నారు. రోడ్ల పక్కన అనధికారికంగా వేసిన రాళ్ల కుప్పలను తొలగించారు. అదేవిధంగా రోడ్డు పక్కన ఉన్న స్తంభాలకు వేలాడుతున్న వైర్లను కూడా తొలగించి ప్రమాదాలను నివారించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, డీఈ రవి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు ఇంటి ముందు వచ్చే చెత్తను స్వచ్ఛ సిబ్బందికి ఇవ్వాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే పెనాల్టీలు విధిస్తామని డిప్యూటీ కమిషనర్ శ్రీహరి హెచ్చరించారు.





# మృతిడి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలియజేసి నా నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి

**ఖానాపురం మార్చి 24 (ప్రజాక్షేత్రం):**
ఖానాపురం మండల బుధరావుపేట గ్రామానికి మండల రెడ్డి సంఘం అధ్యక్షులు పగడాల రాంనరసింహరెడ్డి గారు మృతి చెందాగ వారి భౌతిక కయాన్ని సదర్శించి పూలమాల వేసి నివాళి అర్పించిన నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల జగన్మోహన్ రెడ్డి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాణిగోవర్ధనరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు లింగిడి వెంకటేశ్వర్లు, డివిజన్ ఆత్మ కమిటీ అధ్యక్షులు ఎడ్ల బిక్షంరెడ్డి రాష్ట్ర యూత్ జెంట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్, బ్లాక్ నాయకులు గిరగని నర్సయ్య,మండలం కిషన్ సెల్ అధ్యక్షులు చెడిపాక ఉపేందర్, మండల ప్రచార కార్యదర్శి పసునూరి వెంకన్న,గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ షరీఫ్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి, నారగని సమ్మయ్య, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు,గ్రామ పార్టీ కమిటీ బాధ్యులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.



# మైనర్‌పై అత్యాచార యత్న నిందితుడికి 7 ఏళ్ల జైలు.

- ధైర్యంగా ఎదిరించిన బాలిక
- కోర్టు కఠిన తీర్పు.

వనపర్తి,మార్చి 24 (ప్రజాక్షేత్రం):



మైనర్ బాలికపై అత్యాచారం చేయడానికి యత్నించిన నిందితుడికి కోర్టు కఠిన శిక్ష విధించింది. గోపాల్‌పేట్ మండలం ఏదుల గ్రామానికి చెందిన సింగం శివుడు అనే వ్యక్తికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ₹20,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత మంగళవారం తీర్పు వెలువరించారు. 2023 అక్టోబర్ 31 రాత్రి, బాధిత మైనర్ బాలిక తన పొలం వద్ద మోటార్ ఆఫ్ చేసి ఇంటికి తిరిగి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన నిందితుడు ఆమెను బలవంతంగా పక్కకు తీసుకెళ్లి అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. అయితే బాలిక ధైర్యంగా ప్రతిఘటించి అక్కడి నుంచి తప్పించుకుని, అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై గోపాల్‌పేట్ ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి సమగ్రంగా విచారణ చేపట్టారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు సేకరించి, సాంకేతిక ఆధారాలను కూడగట్టారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. శ్రీనివాసాచారి బలమైన వాదనలు వినిపించగా, కేసు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు నిందితుడికి శిక్ష విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన ఎస్సై జగన్, కోర్టు లైజనింగ్ అధికారి కె. సత్యం, కోర్టు కానిస్టేబుల్ రమేష్ నాయక్ తదితరులను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మహిళలు, చిన్నారుల భద్రత పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యమని, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని,పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

# మార్చి 28న జాతీయ లోక్ అదాలత్

- కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి: జిల్లా ఎస్పీస్నేహ మెహ్రా

వికారాబాద్ బ్యూరో మార్చి 24(ప్రజాక్షేత్రం):



ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, సులభంగా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, 2026 మార్చి 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు ఒక గొప్ప అవకాశమని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరస్పర రాజీ ద్వారా తక్కువ సమయంలో పరిష్కరించుకునే వీలు ఈ వేదిక ద్వారా లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా చిన్న చిన్న వివాదాలు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు మరియు కుటుంబ సమస్యలు వంటి అనేక అంశాలను సులభంగా పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. దీని ద్వారా ప్రజలు కోర్టుల చుట్టూ తిరిగే ఇబ్బందులు తగ్గి, సమయం మరియు వ్యయం రెండూ ఆదా అవుతాయని వివరించారు. లోక్ అదాలత్ అనేది శాంతియుత, రాజీ మార్గంలో జరిగే పరిష్కార ప్రక్రియ కావడంతో, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ విధానం ద్వారా కోర్టు కేసులు త్వరగా ముగిసి, ప్రజల మధ్య మంచి వాతావరణం ఏర్పడుతుందని ఆమె ఆకాంక్షించారు. న్యాయం త్వరగా అందించడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని, కావున పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని ప్రజలు తప్పకుండా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ,కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని తమ సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# షాపూర్ నగర్ మార్కెట్‌లో టీబీపై అవగాహన సదస్సు

- స్కిట్‌తో షాపూర్ నగర్‌లో టీబీపై చైతన్యం
- ప్రజలకు కీలక సూచనలు చేసిన పుప్పాల భాస్కర్

కుత్బుల్లాపూర్, మార్చ్ 24 (ప్రజాక్షేత్రం)

షాపూర్ నగర్ డివిజన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో మంగళవారం క్షయ వ్యాధి (TB) నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిహెచ్ఎంసి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో, మల్లారెడ్డి నర్సింగ్ ఇన్స్టిట్యూషన్స్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ సమాజంలో క్షయ వ్యాధిపై సరైన అవగాహన కలగడం అత్యంత అవసరమని తెలిపారు. టీబీ లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా మల్లారెడ్డి నర్సింగ్ కాలేజీ విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీబీ వ్యాధి వ్యాప్తి విధానం, నివారణ చర్యలు, పౌష్టికాహారం ప్రాముఖ్యత వంటి అంశాలను వారు సులభంగా అర్థమయ్యేలా ప్రజలకు వివరించారు. ప్రాథమిక దశలోనే టీబీని గుర్తిస్తే ప్రాణాపాయం తప్పించుకోవచ్చని విద్యార్థులు అవగాహన కల్పించారు. మార్కెట్‌కు వచ్చిన ప్రజలు ఈ స్కిట్‌ను ఆసక్తిగా వీక్షించి మంచి స్పందన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ఇంచార్జి డా. బాలసుబ్రమణ్యం, అరుణ,వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ, ముకుందరావు,రవికుమార్, సాజిద్,సంజీవ,షాబుద్దీన్,జుబేర్, విద్యార్థులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.







# జూరాల ఆయకట్టుకు క్రాఫ్ హాలిడే

- -జూరాల ఆయకట్టుకు క్రాఫ్ హాలిడే
- పాలమూరు రంగారెడ్డితో సాగునీటి జలకళ
- కల్వకుర్తి పరిధిలో పంటలకు ఇంకా 45 రోజులు నీరు అవసరం
- శ్రీశైలం నీటిని చుక్క చుక్కగా వినియోగించాలి.
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.

వనపర్తి,మార్చి 24 (ప్రజాక్షేత్రం):

పాలమూరు జిల్లాలో సాగునీటి పరిస్థితులపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని గుడిపల్లి రిజర్వాయర్‌ను రైతులతో కలిసి మంగళవారం సందర్శించిన ఆయన, ప్రస్తుత నీటి వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కల్వకుర్తి పరిధిలో పంటలకు కనీసం మరో 45 రోజుల పాటు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీశైలం జలాలను అత్యంత జాగ్రత్తగా, చుక్క చుక్కగా వినియోగించుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని అన్ని ప్రాంతాలకు సమానంగా పంపిణీ చేయాలని ఆయన అన్నారు. కల్వకుర్తి ప్రాజెక్టులో మోటార్ల ద్వారా 240 రోజుల పాటు నీటిని పంపింగ్ చేసే సామర్థ్యం ఉందని, ప్రస్తుతం కూడా పంపింగ్ కొనసాగుతోందని తెలిపారు. ఇదే తరహాలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో కూడా మార్చి చివరి వరకు నీటిని ఎత్తిపోతల చేయవచ్చని చెప్పారు.

**పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌పై రాజకీయ ఆరోపణలు.**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును శ్రీశైలం వద్ద చేపట్టడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం నీటి లభ్యత ఉన్న ప్రాంతం నుంచి నీటిని ఎత్తిపోతల చేయడమేనని నిరంజన్ రెడ్డి వివరించారు. జూరాల వద్ద ప్రాజెక్టు చేపడితే నీటి లభ్యత లేకపోవడంతో పంపింగ్ సాధ్యం కాదని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 45 రోజుల్లోనే సుమారు 90 టీఎంసీల నీటిని ఎత్తిపోతల చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అయితే ప్రాజెక్టును మధ్యలోనే నిలిపివేయడం కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టును కొనసాగించకపోవడం రైతులకు నష్టం కలిగిస్తోందని అన్నారు. కెసిఆర్ హయాంలో ప్రాజెక్టులకు ఊపిరి తెలంగాణ ఉద్యమం అనంతరం సాగునీటి ప్రాజెక్టులకు నిజమైన ప్రాధాన్యం లభించిందని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ నాయకత్వంలో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు భారీగా నిధులు కేటాయించి, కాల్వలు, పంపుహౌజులు, పవర్ లైన్లు వంటి మౌలిక వసతులు పూర్తి చేశారని చెప్పారు. దీంతో సుమారు 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందని తెలిపారు. ఇంకా ఉమ్మడి పాలమూరు జిల్లాలో మిగిలిన 35 లక్షల ఎకరాలకు నీటిని అందించడమే లక్ష్యంగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించారని అన్నారు. మొత్తంగా 32 వేల కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగా, ఇప్పటికే 27 వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించారని తెలిపారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పాలమూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టును నిలిపివేయడం దురదృష్టకరమని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే పనులు పునఃప్రారంభించాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.





# ఆత్మకూరు బి.ఆర్.ఎస్ మరియు నాయకుల అక్రమ అరెస్ట్

- అక్రమ అరెస్ట్ లతో ప్రజాస్వామ్య హక్కులను ఖుని చేస్తున్న కాంగ్రెస్స్ ప్రభుత్వం

ముక్తల్ మార్చి 24 (ప్రజాక్షేత్రం):

ఆత్మకూరు బిఆర్ఎస్ నాయకులు మరియు బిఆర్ఎస్వి నాయకుల వ్యాఖ్య మంగళవారం బి.ఆర్.ఎస్వి అద్వర్యంలో అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఉదయం 5.30 గంటలకు అక్రమంగా ప్రివెంట్ అరెస్ట్ చేసిన ఆత్మకూరు మండల పోలీస్ అధికారులు...ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇలాంటి అక్రమ అరెస్టులు ఎన్ని చేసిన ప్రజల తరుపున ప్రశ్నించడం ఆపమని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు ఈ కాంగ్రెస్స్ ప్రభుత్వానికి వదిలే ప్రసక్తే లేదని తెలియచేసారు. అరెస్ట్ అయినా వారిలో బి. ఆర్. ఎస్ మండల అధ్యక్షులు ఎం. రవి కుమార్ యాదవ్,మాజీ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, బి. ఆర్. ఎస్వి మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు ఎం.డి రియాజ్ అలీ,బి.ఆర్.ఎస్ నాయకులు కొత్త బోయ శేఖర్, బి.ఆర్.ఎస్ యువజన నాయకులు ఏనుముల అనిల్,బి. ఆర్.ఎస్ నాయుకులు సత్యనారాయణ,మాసూమ్, బి.మల్లేష్,రఘు,వెంకటేష్, ఇస్మాయిల్,రఘు,రాము, వెంకటేష్,నరేందర్,శేఖర్, తిరుపతి తదితరులు ఉన్నారు.




# భౌతిక కాయానీకి నివాళులర్పించిన మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శ రెడ్డి

ఖానాపురం మార్చి 24(ప్రజాక్షేత్రం):

ఖానాపూర్ మండల బుధరావుపేట లో (బి ఆర్ ఎస్)మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు పగడాల రామ నరసింహ రెడ్డి మృతి చెందినారు వారి భౌతిక కాయానికి నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి పూలమాల వేసి నివాళు అర్పించారు. మరియు పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి వెంకట నరసయ్య మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్ కుమార్ మాజీ ఎంపీటీసీ షేక్ సుభాన్ బి మౌలానా గ్రామ ఉపసర్పంచ్ సింగ్ సుధాకర్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎస్కే యాకుబ్ పాషా మాజీ అధ్యక్షులు నేలమారి నాగరాజు క్లస్టర్ ఇంచార్జ్ వేల్పుల లింగయ్య బాలు న్ వార్డు సభ్యులు పసునూరి రమేష్ సిహెచ్ శీను షేక్ రహీం షేక్ జుబేర్ బండి రాజు యాకుబలి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి మల్లయ్య పసునూరి నరసయ్య లాదినే ఎల్లయ్య ఎస్కే ఆసిఫ్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బత్తిని శాంతికుమార్ సోమారపు రవి బొల్లం వీరస్వామి ఆకుల లక్ష్మణ్ రాజు తదితరులు పాల్గొనడం.



# బరితెగించిన ఇసుక మాఫీయా..!

- పోలీసు వాహనాన్ని ఢీ కొట్టిన అక్రమార్కులు
- పెట్రోలింగ్ విధుల్లో ఎస్ఐ, సిబ్బందిపై దూసుకెళ్లిన వైనం
- బషీరాబాద్ మండలంలో ఘటన

వికారాబాద్ బ్యూరో మార్చి 24(ప్రజాక్షేత్రం):

తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలంలో ఇసుక మాఫీయా బరితెగింది. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఎస్ఐ, సిబ్బందిపై ట్రాక్టర్లతో దూసుకవచ్చి పోలీసు వాహనాన్ని ఢీ కొట్టారు. ఈ సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ ఎస్ఐ శ్రీశైలం యాదవ్, సిబ్బందితో కలిసి పెట్రొలింగ్ నిర్వహిస్తున్నారు. మండలంలోని కోర్విచేడ్ గేటు వద్ద బషీరాబాద్ వస్తుండగా దామర్‌చేడ్ సురేష్, నంద్యానాయక్ శ్రీనివాస్‌లకు చెందిన ట్రాక్టర్లు నవల్గా వైపు వెళుతూ కనిపించారు. పోలీసులు పట్టుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో సురేష్, శ్రీనివాస్‌లు ట్రాక్టర్లతో పోలీసు వాహనాన్ని ఢీ కొట్టారు. దీంతో పోలీసు వాహనాన్ని బలమైన దెబ్బ తగిలింది. వెంటనే ఇసుక అక్రమార్కులు సురేష్, శ్రీనివాస్‌లు పరారయ్యారు. పోలీసులు నిందితుల నివాసాలకు వెళ్లి విచారింగా అచూకీ లభించలేదు. నిందితులను ఎలాగైనా పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. మరోవైపు మండలంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫీయాపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోలీసు విధుల్లో ఉన్న కానిస్టేబుల్ కాళ్లపై నుంచి ట్రాక్టర్ ఎక్కించారని, తాజాగా పోలీసు వాహనాన్ని ఢీ కొట్టడం చర్చనీయాంశంగా మారింది.





## ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించిన బాపట్ల జిల్లా ఎస్పీ మరియు కలెక్టర్

**చీరాల,మార్చి 24(ప్రజాక్షేత్రం):**

బాపట్ల జిల్లా చీరాల మండలంలో ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్‌తో కలిసి ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని వి.ఆర్.ఎస్ & వై.ఆర్.ఎన్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, కెజిబివి, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం, చీరాల ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని బీసీ సంక్షేమ వసతి గృహం, కటారారి వారి పాలెం, జడ్పీ స్కూల్, ఓడరేవు జడ్పీ స్కూల్ తదితర ప్రాంతాలను వారు సందర్శించారు. అలాగే వి.ఆర్.ఎస్ & వై.ఆర్.ఎన్ కళాశాల మరియు మెడికల్ కళాశాల పరిసరాల్లో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనుకూలమైన ప్రదేశాలను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు,జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్,సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ సత్యనారాయణ,గిరిజన సంక్షేమ అధికారి అబ్బులు ,చీరాల మరియు వేటపాలెం మండలాల తహశీల్దార్లు గోపీకృష్ణ,గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- **ముగ్గురు పట్టివేత**

**దమ్మపేట,మార్చి 24 (ప్రజాక్షేత్రం):**



దమ్మపేట మండల పరిధిలోని పెద్ద గొల్లగూడెం గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, గ్రామ చివరలో ఉన్న స్మశాన వాటిక సమీపంలో కొంతమంది పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.12,400 నగదు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, మరో ఇద్దరు వ్యక్తులు ఘటన స్థలం నుండి పరారయ్యారు. పరారీలో ఉన్న వారిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

## ఆస్తి పన్ను వసూళ్లపై మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తం.

- **100% లక్ష్యం సాధనకు ఆదేశాలు.**

**వనపర్తి,మార్చి 24 (ప్రజాక్షేత్రం):**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ ఎం మాధవి రమేష్ అధికారులు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాల్గొని వసూళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, 2025-2026 ఆర్థిక సంవత్సరం ముగియడానికి చాలా తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉందని, ఇప్పటివరకు కేవలం 33 శాతం మాత్రమే ఆస్తి పన్ను వసూళ్లు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు మున్సిపాలిటీలకు విడుదల కావాలంటే కనీసం 50 శాతం పైగా పన్ను వసూళ్లు తప్పనిసరిగా ఉండాలని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మిగిలిన రోజుల్లో వసూళ్లను గణనీయంగా పెంచాలని, ప్రతిరోజూ కనీసం రూ.40 లక్షల మేర పన్ను వసూలు చేయాలని సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించారు. వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వార్డు ఆఫీసర్ తమ పరిధిలో ఉన్న బకాయిదారులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వసూళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, బకాయిలు చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో డీఈ యూనుస్, మేనేజర్ శంకర్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమ మహేశ్వర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తే లక్ష్యం సాధ్యం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## మొయినాబాద్ డ్రగ్స్ కేసు: సిట్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి.

**వికారాబాద్ బ్యూరో మార్చి 24(ప్రజాక్షేత్రం):**

బీఆర్ఎస్ తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంపై శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కేంద్రంగా సిట్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. నిందితుల వాంగ్మూలాలు ఈ కేసును మరో మలుపు తిప్పాయి. ముగ్గురు నిందితులను విడివిడిగా విచారిస్తున్న సిట్ బృందం పలు సంచలన విషయాలను రాబట్టింది. ప్రధాన నిందితుడు రోహిత్ రెడ్డి గత ఏడాది కాలంగా క్రమం తప్పకుండా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు.

**తప్పుదోవ పట్టించిన కౌశిక్ రవి..**

ఈ కేసులో డ్రగ్స్ సరఫరా చేసిన అభిషేక్ సింగ్ అత్యంత కీలకంగా మారాడు. రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు అతని డ్రైవర్ సిలివేరి శరత్, అవుటర్ రింగ్ రోడ్ (ORR) వద్ద అభిషేక్ నుంచి డ్రగ్స్ సేకరించినట్లు సిట్ విచారణలో తేలింది. నిందితుల్లో ఒకరైన కౌశిక్ రవి, డ్రగ్స్ సిమ్లా నుంచి తెచ్చినట్లు పోలీసులకు చెప్పి దర్యాప్తును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడు. అయితే, సిట్ తనదైన శైలిలో విచారించడంతో అసలు విషయం బయటపడింది.

**మిస్టరీగా మారిన పెడ్లర్ అభిషేక్ సింగ్ పరారీ**

డ్రగ్స్ పార్టీ వ్యవహారం బయటకు రాగానే పెడ్లర్ అభిషేక్ సింగ్ అదృశ్యమయ్యాడు. ఈ నెల 16 నుంచి తన కుమారుడు కనిపించడం లేదని అభిషేక్ తండ్రి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం అభిషేక్ పరారీలో ఉన్నాడని, అతనిని పట్టుకుంటే ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంతమంది ప్రముఖుల పేర్లు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

**సిట్ తదుపరి చర్యలు**

నిందితులను ఘటనా స్థలానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. నిందితుల మొబైల్ ఫోన్లలోని కాల్ డేటా,



వాట్సాప్ చాట్‌లను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. రోహిత్ రెడ్డి రక్త నమూనాలను సేకరించి, డ్రగ్స్ తీసుకున్న సమయాన్ని, రకాన్ని శాస్త్రీయంగా నిర్ధారించనున్నారు. ఈ కేసులో సెలబ్రిటీలు లేదా రాజకీయ ప్రముఖుల ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా సిట్ ఆరా తీస్తోంది. అభిషేక్ సింగ్ దొరికితే ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది.

## ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు నాణ్యమైన సేవలకు ప్రతీకలుగా నిలవాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**పినపాక మార్చి 24(ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ఆదర్శ కేంద్రాలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు .మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన,ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యా మరియు వైద్య సేవల అమలును సమగ్రంగా పరిశీలించారు. మొదటగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, మందుల గది, ప్రయోగశాల (ల్యాబ్), ఇన్‌పేషెంట్ విభాగం, స్టాక్ రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. అవుట్‌పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి, రోజువారీగా వచ్చే రోగుల సంఖ్యపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవుట్‌పేషెంట్ వార్డులో ఉన్న ఒక బాలుడితో మాట్లాడి, కుక్క కాటు టీకా కోసం వచ్చినట్లు తెలుసుకుని, టీకాలు అందుబాటులో ఉన్నాయా అని విచారించారు.అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఏ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారో, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. తనిఖీ సమయంలో మెడికల్ అధికారి అందుబాటులో లేకపోవడంతో కారణాలను ప్రశ్నించగా క్షేత్రస్థాయిలో పర్యటనలో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు, వెంటనే మెడికల్ అధికారిని పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది సిబ్బంది యూనిఫాం (ఆప్రాన్) ధరించకపోవడాన్ని గమనించి, విధి సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. సిబ్బంది డిప్యూటేషన్‌పై అధిక సంఖ్యలో విధులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించి, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు.అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తూ, ఇటీవల జరిగిన ఇంగ్లీష్ పరీక్షపై విద్యార్థులను అడిగి తెలుసుకుని, రాబోయే గణిత పరీక్షకు క్రమబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించి, సులభ పాఠాలను పునరావృతం చేయిస్తూ విద్యార్థులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని తనిఖీ చేశారు. మెనూలో ఉన్న కొన్ని పదార్థాలు లేకపోవడంపై కారణాలు అడిగి తెలుసుకుని, వడ్డించిన ఆహారాన్ని తిని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. వంటల్లో ఉప్పు అధికంగా ఉన్నట్లు గమనించి, సరిపడ మోతాదులో మాత్రమే వినియోగించాలని సూచించారు.విద్యార్థులకు పోషకాహారం అందించాలంటే మెనూ ప్రకారం అన్ని పదార్థాలు తప్పనిసరిగా వండాలని స్పష్టం చేశారు.స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు.ఎండాకాలంలో కూరగాయలు త్వరగా పాడయ్యే అవకాశం ఉన్నందున తాజా,నాణ్యమైన కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు.మెనూలో ఉన్న బీట్‌రూట్,పాలకూర అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు గురించి విచారించి, ఆర్ ఓ ప్లాంట్ నుంచి వచ్చే వేస్ట్ వాటర్‌ను శుభ్రత పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ట్యాపుల లీకేజీ గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు మరియు ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ముఖ్య కేంద్రాలని తెలిపారు . విద్యార్థులకు నాణ్యమైన





విద్యతో పాటు పోషకాహారం, పరిశుభ్ర వాతావరణం కల్పించడం అత్యవసరమని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు క్రమబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయులు వారికి సమగ్ర మార్గదర్శనం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సమయానుకూలంగా వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని, టీకాలు మరియు అత్యవసర మందులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను వేగంగా ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని, రిఫరల్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ యూనిఫాం నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని,లోపాలు గుర్తించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మెడికల్ అధికారి ప్రియాంక,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల ఐక్య సమావేశం ఘనంగా నిర్వహణ

**చీరాల,మార్చి24(ప్రజాక్షేత్రం):**

బాపట్ల జిల్లా చీరాలలో నాయి బ్రాహ్మణుల ఐక్య సమావేశం ఘనంగా నిర్వహించబడింది. పట్టణంలోని రోటరీ క్లబ్ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశానికి నాయి బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృతంగా చర్చించారు. వారి హక్కుల పరిరక్షణ, రిజర్వేషన్ అవకాశాలు, విద్యుత్ వినియోగంలో 200యూనిట్ల వరకు ఉచిత సదుపాయం, వ్యక్తిగత దూషణలపై కఠిన చర్యలు వంటి అంశాలను నాయకులు వివరించారు. అలాగే నాయి బ్రాహ్మణులకు అసెంబ్లీలో ప్రాధాన్యత కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్ర స్థాయి నాయకుల ఆధ్వర్యంలో ఈ ఐక్య సమావేశం నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల-పేరాల నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కోరువాడ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు వల్లూరి వెంకట సుబ్బారావు, కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి మేడిశెట్టి సత్యనారాయణ, చైర్మన్ రుద్ర కోటి సదాశివం పాల్గొన్నారు. అలాగే ఏపీ నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ డైరెక్టర్ నిడమానూరు రమేష్ ముఖ్య అతిథిగా హాజరై నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమావేశంలో పలువురు నాయి బ్రాహ్మణులు ఐక్యంగా పాల్గొని సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## ఐదవ వార్డులో వేసవి నీటి సమస్యల నివారణకు ముందస్తు చర్యలు పైపులైన్ మరమ్మత్తులు

**ముక్తల్ మార్చి 24 (ప్రజాక్షేత్రం):**

మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలోని స్థానిక ఐదవ వార్డులో రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కౌన్సిలర్ దండు శ్రీనివాసులు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టారు. అదనంగా నీటి కుళాయిల పైప్లైన్లను మరమ్మత్తులు చేసి, పాత పైపుల స్థానంలో కొత్త పైపులను అమర్చడం జరిగింది. దీని ద్వారా వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా ప్రజలకు సరఫరా అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని గౌరవ మక్తల్ శాసనసభ్యులు మరియు పాడి పశుసంవర్ధక, క్రీడ యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు వైస్ చైర్మన్ ప్రాతినిధ్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, ఐదవ వార్డు కౌన్సిలర్ దండు శ్రీనివాసులు, ఒకటో వార్డు కౌన్సిలర్ కోట్ల తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్గొండ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా నిరంతరం అందేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. రాబోయే వేసవిలో ఎవరూ నీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా మున్సిపల్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి సేవలందిస్తామని హామీ ఇచ్చారు. అదనంగా, వార్డు పరిధిలో నీటి సరఫరా సమయాలను పర్యవేక్షిస్తూ అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పాత బోర్లు, మోటార్లు, వాల్వులను పూర్తిగా తనిఖీ చేసి ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేపడతామని చెప్పారు. ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించాలని సూచించారు. మున్సిపల్ పాలకవర్గం ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని,భవిష్యత్తులో కూడా మరిన్ని మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొని అభినందనలు తెలిపారు.





## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం

- **మణికొండ తెరాస పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాల**

**రాజేంద్రనగర్, మార్చి 24(ప్రజాక్షేత్రం):**

మణికొండ ప్రాంత ప్రజల సమస్యల కొరకు నిరంతరం పోరాడుతామని మణికొండ తెరాస పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాల నాయకులు అన్నారు. మంగళవారం శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ కలసి మణికొండలో అంబేద్కర్ భవన్, బుల్కాపూర్ నాలా, వీధి వ్యాపారస్తుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, పందెం వాగు బాక్స్ డ్రై కట్టడం, టీం ఫోర్ బిల్డర్స్ పై చర్యలు, ఇండ్ల మధ్య లో రెడ్మి సిమెంట్ ప్లాంట్లకు అనుమతి నిరాకరణ, ట్రాఫిక్ సమస్య ఉన్న రహదారులలో వైన్ షాపులకు అనుమతి నిరాకరణ, సమీకృత సమగ్ర మార్కెట్ ఏర్పాట్లు తదితర అంశాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినను అధికారుల నుండి ఎలాంటి స్పందన రాలేదని, అధికారులు ప్రజా సౌకర్యార్థం సంబంధిత పనులు చేపట్టాలని కమిషనర్కు వివరించారు. లేనియెడల ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం చేపట్టామని హెచ్చరించారు. అందులో భాగంగా మున్సిపల్ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ అమృతను కలసి పలు పార్క్ అభివృద్ధి పనుల విషయంపై చర్చించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంభ గళ్ళ ధనరాజ్, గుట్టమీద నరేందర్, ఉపేంద్ర నాథ్ రెడ్డి, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, నూకల మంజు, దేవి ప్రియ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి ధాన్యం కొనుగోళ్లకు పూర్తి సన్నద్ధత

- **కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆదేశాలు**

**కరీంనగర్, మార్చి 24(ప్రజాక్షేత్రం):**

యాసంగి సీజన్లో ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తుగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని ఆమె ఆదేశించారు. జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది యాసంగి సీజన్లో 2,73,550 ఎకరాల్లో వరి సాగు జరిగిందని తెలిపారు. సుమారు 6,46,320 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేస్తుండగా, అందులో 3,67,776 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశముందని వివరించారు. జిల్లాలో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డిసిఎంఎస్, హాకా ఆధ్వర్యంలో మొత్తం 322 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కేంద్రాల్లో తార్పాలిన్, తేమ కొలిచే యంత్రాలు, బరువు తూచే యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, డ్రైయర్లు, కాలిపర్స్ వంటి పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. పూర్తిగా పక్వానికి వచ్చిన ధాన్యాన్ని మాత్రమే కోయాలనే విషయంపై రైతులు, హార్వెస్టర్ యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు, రవాణా తదితర ప్రక్రియలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## గ్యాస్ సరఫరాలో అక్రమాలకు చెక్

- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**
- **కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, మార్చి 24(ప్రజాక్షేత్రం):**

గ్యాస్ సరఫరా వ్యవస్థలో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హెచ్చరించారు. మంగళవారం సీతారాంపూర్లోని నిర్మల భారత్ గ్యాస్ ఏజెన్సీ గోదాములో ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ, వాణిజ్య సిలిండర్ల బుకింగ్, స్టాక్ నిల్వలు, రోజువారీ సరఫరా వివరాలను పరిశీలించారు. సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేసి, ఆస్పత్రులు, వాణిజ్య సంస్థలు, గృహ వినియోగదారులకు జరుగుతున్న సరఫరా స్థితిగతులను ఆరా తీశారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గ్యాస్ సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎటువంటి అక్రమాలు చోటుచేసుకున్నా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. స్టాక్, బుకింగ్ వివరాలను నిరంతరం పౌరసరఫరాల శాఖకు నివేదించాలని డీలర్లకు సూచించారు. ఈ తనిఖీలలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు పాల్గొన్నారు.




## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలి

- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

**మహేశ్వరం, మార్చి 24(ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్ లతో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 10 థీములతో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మున్సిపాలిటీల, గ్రామ పంచాయతీల వారీగా పారిశుధ్యం పనులు, విద్యుత్ కు సంబంధించిన మరమ్మత్తులు, భవనాల మరమ్మత్తులు, పెయింటింగ్ వంటి పనులు పూర్తి చేయాలని, కార్యాలయాల పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ పూర్తి చేయాలని, ఏ ఒక్క శాఖలో కూడా ఒక్క ఫైల్ కూడా పెండింగ్లో ఉండకుండా పరిష్కరించాలని సూచించారు. మంజూరైన పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వాటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. జనన మరణ ధృవీకరణ పత్రాల జారీ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఫైల్ లు క్లియర్ చేయాలని అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్లక్ష్య వైఖరితో కాకుండా బాధ్యతతో ప్రతి ఒక్కరూ తమకు నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా పని చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో సమార్థవంతగా నిర్వహించి విజయవంతగా పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. ప్రతి శాఖ ఈఆఫీస్ నిర్వహణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వేసవి కాలం అయినందున జిల్లాలో ఏ ఒక్క చోట కూడా త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని, అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, పైపు లీకేజులు లేకుండా చూడాలని, ఎక్కడ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అవసరమైన చోట బోరు మోటార్లు, హ్యాండ్ పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపించాలని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాలను సైతం సందర్శిస్తూ నీటి సరఫరా తీరుతెన్నుల గురించి వారి ద్వారా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుత వేసవి సీజన్ దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు, ఎంపిడిఓలు సమన్వయంతో, సమిష్టిగా పని చేయాలని అన్నారు. నీటి కొరత ఏర్పడకుండా చేపడుతున్న చర్యలు ప్రజలకు తెలిసేలా చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతం, జడ్పీ సి ఈ ఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేశ్ మోహన్, సిపిఓ సౌమ్య, పిడి డీఆర్డీఏ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషురామ్, కె.రామవేశ్వరి దేవి, పద్మావతి, ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంపిఒలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఊరికి దూరంగా ఉంది
## మనకెందులే

- **రోడ్ అవతల ఉన్నది మనకు అవసరమా**
- **- దేవుని ఎర్రవల్లి పొలిమేర చేరుకోలేని అభివృద్ధి**
- **ఈ ఫ్యాక్టరీ వెనుక ఎవరు ఉన్నారు**
- **అధికారులకు తెల్వదా తెలిసిన ప్రజలను నమ్మించడమే మొదటి లక్షమా**

**చేవెళ్ల మార్చి 24(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి నుండి చేవేళ్ల కు వస్తుంటే దేవుని ఎర్రవల్లి గేటు ఈ ఫ్యాక్టరీ ఉంటుంది మొదట గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది ప్రస్తుతం చేవెళ్ల మున్సిపాలిటీలోని 3 వార్డ్ దేవుని ఎర్రవల్లి రెవిన్యూ ప్రయివేటు ఫ్యాక్టరీ కావున దీని నుండి వచ్చే దూర్వసన మినిమం 200 మీటర్ల వరకు దుర్వాసన విస్తరించి వస్తుంది. ఫ్యాక్టరీ ముందు రోడ్ మల్కాపూర్ నుండి చేవెళ్ల కు దేవుని ఎర్రవల్లికి రెవిన్యూ రికార్డ్ లా ప్రకారం నక్షా తోవకావడంతో వచ్చిపోయే ప్రజలకు చాలా ఇబంధులు పడుతున్నారు. ఈ ఫ్యాక్టరీ 40 మీటర్స్ దూరంలోనే హైవే ఉండటంతో చూటుపకాల లేఔట్స్ మరియు ఫామ్ ల్యాండ్స్ ఫామ్ హౌస్ లు ఉండడంతో పక్కన ఉన్న లే అవుట్ లో ప్లాట్స్ కొనుగోలు చేసిన మధ్యతరగతి ప్లాట్స్ యాజమానులు అవసరానికి మళ్ళీ తిరిగి అమ్ముకోలేక పోతున్నామాని వారి ఆవేదన వక్తపార్చారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ యాజమాన్యం హాండర్ గ్రౌండ్ చేసి దుర్వసన బయటికి రాకుండా చేయకపోతే మున్సిపాలిటీ కమీషనర్ కు వినతి పత్రంతో పాటు 3 వార్డ్ కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్తామని ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు.



## ఇసుక లారీ కోసం లంచం గూగుల్ పేలో డీల్

- **ఏసీబీకి చిక్కిన ఎస్సై**

**కరీంనగర్, మార్చి 24(ప్రజాక్షేత్రం):**



ఇసుక లారీ విడుదల పేరుతో లంచం డిమాండ్ చేసి గూగుల్ పే ద్వారా డబ్బులు తీసుకున్న ఎస్సై పూర్లుగొండ వెంకటేశ్వర్లు ఏసీబీ వలలో చిక్కి అరెస్ట్ కావడం పోలీస్ వ్యవస్థలో మరోసారి అవినీతిని బట్టబయలు చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముస్తాబాద్ ఎస్హెచ్ఓగా పనిచేసిన ఆయన ప్రస్తుతం సిద్ధిపేట కమిషనరేట్ లో విధులు నిర్వహిస్తుండగా ఈ కేసు బయటపడింది. ఫిర్యాదుదారుడి ఇసుక లారీ విడుదలకు మొదట రూ.20,000 లంచం డిమాండ్ చేసిన ఎస్సై తరువాత దాన్ని రూ.15,000కు తగ్గించి తీసుకున్నట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఈ మొత్తాన్ని మధ్యవర్తిగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ బి. సత్యనారాయణ ద్వారా గూగుల్ పేలో ట్రాన్స్ఫర్ చేయించుకోవడం ద్వారా ఎస్సై తన అధికారాన్ని బహిరంగంగా దుర్వినియోగం చేసినట్లు అధికారులు నిర్ధారించారు. మార్చి 23, 2026న ఎస్సై వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు అనంతరం కరీంనగర్ స్పెషల్ కోర్టులో హాజరు పరిచారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉండగా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం కోరితే వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఎస్సై స్థాయి అధికారే ఇలా లంచం తీసుకోవడం పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను మసకబార్చగా ఏసీబీ దాడులు మరింత కఠినంగా కొనసాగనున్నాయని సంకేతాలు స్పష్టమవుతున్నాయి.

## బాలాపూర్ డివిజన్ లో సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**మహేశ్వరం, మార్చ్ 24(ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధిలోని బాలాపూర్ డివిజన్ లో సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి భరోసాగా సిఎం సహాయనిది అండగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో లబ్ధిదారులకు ఈరోజు బాలాపూర్ లో చెక్కులు అందజేశారు. గత కొద్దీరోజుల క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొందిన కుళ్ళ జంపయ్య కు 40, 000/, దేవరత్ నందిని కి 60, 000/ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బలింగని జంగయ్య, కోలన్ తిరుపతి రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, సిరిగని సాయి, గిరి ముదిరాజ్, మసూద్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



## సమాజ రక్షణలో మహిళా పోలీసుల కీలక పాత్ర

- **సేవా భావంతో విధులు నిర్వహించాలి**
- **సీపీ గౌష్ అలం**

**కరీంనగర్, మార్చి 24(ప్రజాక్షేత్రం):**




మహిళా పోలీసు అధికారుల్లో నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కరీంనగర్ పోలీస్ ఆధ్వర్యంలో 'షీ లీడ్స్-2026' సదస్సు నిర్వహించారు. మంగళవారం అస్త్ర కన్వెన్షన్లో జరిగిన ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ రక్షణలో మహిళా పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అధికారం కోసం కాకుండా సేవా భావంతో బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిబద్ధతతో పాటు బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని వివరించారు. సదస్సులో పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా అధికారుల్లో మనోధైర్యాన్ని పెంపొందించే అంశాలపై డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ కలాం ప్రసంగించారు. ఆరోగ్యం, యోగా ప్రాముఖ్యతపై దీప్తి వివరించారు. విధుల నిర్వహణలో బాధితులు, నిందితులు, ఆందోళనకారుల పట్ల అనుసరించాల్సిన విధానాలపై ఏసీపీ మాధవి అవగాహన కల్పించారు.మధ్యాహ్నం మహిళా పోలీసుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు గైనకాలజీ సంప్రదింపులు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, నేత్ర పరీక్షలు చేపట్టారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారికి బహుమతులు అందజేసి సన్మానించారు. అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు మాధవి, వేణుగోపాల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రజినీ కాంత్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీలోగా వాసవీ ఉత్సవాలపై నిర్ణయం: సీఎం హామీ

- గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న వాసవీ పారాయణం
- తెలంగాణ మంత్రివర్గంలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలి
- వాసవీ మహోత్సవంలో వెల్లువెత్తిన ఆర్యవైశ్యుల అఖండ ఐక్యత
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆర్యవైశ్యులే మూల స్తంభాలు
- ఐకమత్యం చాటితేనే ఆర్యవైశ్యులకు దక్కాల్సిన రాజకీయ గౌరవం
- వాసవీ మాత త్యాగనిరతే వైశ్యుల సేవా దృక్పథం






**హైదరాబాద్ మార్చి 24(ప్రజాక్షేత్రం):** హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియం మునుపెన్నడూ లేని wవిధంగా ఒక దివ్యమైన ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆర్యవైశ్యుల ఐకమత్యం, భక్తి ప్రపత్తులు ఒకేచోట మహాసముద్రంలా ఉప్పొంగిన అద్భుత ఘట్టం శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం. ఒకవైపు అమ్మవారి నామస్మరణ, మరోవైపు జాతి జాగృతి కలగలిసిన ఈ వేదిక ఆర్యవైశ్యుల కీర్తి పతాకను సగర్వంగా ఎగురవేసింది. ఊరికొక్కరున్నా ఊరందరినీ కలుపుకుపోయే వైశ్యుల సంఘటిత శక్తికి, వారి సేవా తత్పరతకు ఈ మహోత్సవం ఒక నిలువెత్తు అద్దంలా నిలిచింది. ఈ ప్రతిష్టాత్మక వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్యుల ప్రాధాన్యతను ఘనంగా కీర్తించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ, గ్రామీణ రైతాంగానికి అండగా ఉంటున్న వైశ్యులకు తమ ప్రభుత్వంలో సముచిత గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. అహింసా మార్గాన్ని ప్రపంచానికి చాటిన మహాత్మా గాంధీ వైశ్య జాతిలో జన్మించడం అందరికీ గర్వకారణమన్న ఆయన, ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీ కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ, జయంతి దినోత్సవాలను అధికారికంగా నిర్వహించే విషయంపై అసెంబ్లీ సమావేశాల లోగానే సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, మాజీ ముఖ్యమంత్రి దివంగత రోశయ్య పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకుంటూ, ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నామని, ఆయన విగ్రహాన్ని సైతం ఆవిష్కరించామని గుర్తుచేశారు. భక్తిభావం మిళితమైన ఈ కార్యక్రమంలో ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రముఖ కవి చింతల శ్రీనివాస్ రచించి, జోశ్యభట్ల స్వరపరిచిన వాసవీ మాత పారాయణాన్ని ప్రముఖ గాయని కల్పన ఆలపించగా, వేలాదిగా తరలివచ్చిన ఆర్యవైశ్యులు భక్తిపారవశ్యంతో సామూహికంగా పారాయణం చేశారు. ఈ సామూహిక ఆధ్యాత్మిక ప్రదర్శన గిన్నిస్ ప్రపంచ రికార్డును సాధించి, వైశ్యుల ఐక్యతను విశ్వవ్యాప్తం చేసింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, వాసవీ మాత ఉత్సవాలను అధికారికంగా జరపాలని కోరారు. ఆర్యవైశ్యులంతా ఒకే తాటిపైకి రావడం వారి సంఘీభావానికి నిదర్శనమని వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు బెల్ది శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే వేదికపై ఆర్యవైశ్యుల రాజకీయ, సామాజిక సాధికారత గురించి ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి టీజీ భరత్ కీలక దిశానిర్దేశం చేశారు. తెలంగాణ జనాభాలో దాదాపు ఐదు శాతం ఉన్న వైశ్యులకు 2014 నుంచి మంత్రివర్గంలో స్థానం దక్కలేదని, ఈ దఫా వారికి తప్పక ఒక మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరుతానని తెలిపారు. సమాజానికి ఆపదొచ్చినప్పుడు ముందుండే వైశ్యులు తమ శక్తిని చాటినప్పుడే రాజకీయంగానూ తగిన గౌరవం దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పేరు చివరన గుప్త అని చేర్చుకోవాలని సూచించారు. ఈ ఉత్సవాల్లో కర్ణాటక ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్ తో పాటు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కోలేటి దామోదర్, ఉప్పల శ్రీనివాస్, ధన్ పాల్ సూర్యనారాయణ, బిగాల గణేష్, చీకోటి ప్రవీణ్, మలిపెద్ది శంకర్, రాజమౌళి, కేసీపీ అనిల్, కౌటికె విఠల్, రావికంటి శ్రీనివాస్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డి దృఢ నిర్ణయం బుజ్జగింపులు ఫెయిల్

**జగిత్యాల జిల్లా మార్చి 24(ప్రజాక్షేత్రం):** జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీలో భారీ రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఒప్పించేందుకు చివరి ప్రయత్నంగా తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కలిసి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి కీలకంగా చర్చలు జరిపారు. దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో జీవన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీని విడవవద్దని ఆయనకు పార్టీతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేస్తూ నాయకులు బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జీవన్ రెడ్డి 43 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకుడని తాను 1986 నుంచే ఆయనతో వ్యక్తిగత అనుబంధం కలిగి ఉన్నానని తెలిపారు. ఇంత అనుభవం ఉన్న నాయకుడు ప్రస్తుత పరిస్థితుల్లో కొంత ఇబ్బందులకు గురవడం సహజమని, రాజకీయంగా కొన్ని నిర్ణయాల వల్ల ఇలాంటి పరిస్థితులు వస్తాయని అన్నారు. ఇటీవల ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహా పలువురు నేతలు కూడా జీవన్ రెడ్డిని కలిసి చర్చలు జరిపారని గుర్తు చేశారు. ఏఐసీసీ నాయకత్వం కూడా జీవన్ రెడ్డిని పార్టీలో కొనసాగాలని కోరుతోందని ఆయనలాంటి నాయకుడిని పార్టీ వదులుకోదని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అన్న అశతోనే తాను వెలుతున్నానని అయన తెలిపారు. అయితే ఈ బుజ్జగింపులన్నింటినీ జీవన్ రెడ్డి తోసిపుచ్చినట్లు సమాచారం. తనకు కాంగ్రెస్ పార్టీలో వరుసగా అవమానాలు ఎదురవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో పార్టీని వీడటం తప్ప మార్గం లేదని ఆయన స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. పార్టీకి రాజీనామా చేయాలనే నిర్ణయంపై తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని సమావేశంలోనే ఆయన కుండబద్ధలు కొట్టినట్లు సమాచారం. ఇక బుధవారం జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు జీవన్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5 వేల మంది కార్యకర్తలతో ఈ సభ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ సభ వేదికపైనే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వివిధ వేదికల ద్వారా తనకు పార్టీలో జరుగుతున్న అన్యాయాలను జీవన్ రెడ్డి బహిరంగంగా వెల్లడించిన విషయం తెలిసిందే. తన రాజకీయ భవిష్యత్తుపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని చెప్పిన ఆయన ఇప్పుడు ఆ నిర్ణయానికి దగ్గరయ్యారని స్పష్టమవుతోంది. మొత్తానికి కాంగ్రెస్ అధిష్ఠానం చేసిన చివరి ప్రయత్నాలు కూడా ఫలించకపోవడంతో తెలంగాణ రాజకీయాల్లో మరో పెద్ద ట్విస్ట్ కు వేదిక సిద్ధమవుతోంది.



# టీబీ నిర్మూలనకు అందరి భాగస్వామ్యం అవసరం

- గాంధీలో ప్రపంచ టీబీ దినోత్సవం

**సికింద్రాబాద్, మార్చి 24 (ప్రజాక్షేత్రం):** క్షయవ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ వైద్య కళాశాలలోని అలుమ్ని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన '100 రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి విడతలో 17.09 లక్షల మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా కోట్లాది మందికి పోషకాహారం అందించామని పేర్కొన్నారు. టీబీ నిర్మూలనలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని చెప్పారు. టీబీ లక్షణాలు ఉన్న వారికి ఉచిత పరీక్షలు, మందులు అందిస్తున్నామని, వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్న స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్య కార్యకర్తల సేవలను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా టీబీ నిర్మూలనలో మెరుగైన పనితీరు కనబరిచిన జిల్లాల అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రచార పోస్టర్లను విడుదల చేయడంతో పాటు, టీబీ బాధితులకు పోషకాహారం పంపిణీ చేశారు. '100 రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్' ప్రచార యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డా. ఎం. అనురాధ, ప్రజా ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. రవీందర్ నాయక్, తెలంగాణ టీబీ అసోసియేషన్ వైస్ చైర్మన్ డా. సుధీర్ ప్రసాద్, ఎస్టిడీసీ డా. రాజేశ్వరి, డబ్ల్యూహెచ్ఓ టీబీ కన్సల్టెంట్ డా. మహేష్, డా. బ్లెస్సి, జేడీ టీబీ ఆఫీస్ హెల్త్ ఎక్స్టెన్షన్ అధికారి మొగరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# శంకర్ పల్లి లో పెట్రోల్ కొరత బంకుల వద్ద వాహనదారుల రద్దీ!

**శంకర్ పల్లి మార్చి 24(ప్రజాక్షేత్రం):** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. పెట్రోల్ కోసం వాహనదారులు భారీగా బారులు తీరడంతో బంక్ పరిసరాల్లో పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి. శంకర్ పల్లి మరియు సమీప ప్రాంతాల్లో పలుచోట్ల పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా ఉద్యోగస్తులు రేపటికి పెట్రోల్ దొరకకపోతే ఎలా అనే ఆందోళనతో గంటల తరబడి క్యూలలో నిలబడుతున్నారు. కొన్ని పెట్రోల్ బంకులు స్టాక్ లేక మూసివేయబడటంతో, అందుబాటులో ఉన్న బంకుల వద్ద రద్దీ మరింత పెరిగింది. "సరఫరా ఆలస్యమే ఈ సమస్యకు ప్రధాన కారణమని పెట్రోల్ బంక్ నిర్వాహకులు తెలిపారు. డిమాండ్ కు సరిపడా స్టాక్ చేరకపోవడంతో తాత్కాలిక కొరత ఏర్పడిందని వారు వెల్లడించారు." ఇక కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి లోటు లేదని చెబుతున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితి మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. సరఫరా ఆలస్యమే ఈ సమస్యకు ప్రధాన కారణమని పెట్రోల్ బంక్ నిర్వాహకులు తెలిపారు. డిమాండ్ కు సరిపడా స్టాక్ చేరకపోవడంతో తాత్కాలిక కొరత ఏర్పడిందని వారు వెల్లడించారు. ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకుని సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# అంతరించిపోతున్న సంచార జాతులు...?

సంచార జాతుల జీవితంలో వెలుగెన్నడు... ప్రభుత్వాలు మారిన మారని వారి బతుకులు మాత్రం మారడం లేదు... కులాల గుర్తింపు లేక తమ పిల్లలను చదివించుకోలేక ప్రభుత్వం సర్టిఫికెట్ ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్న సంచార జాతులు ఆరోగ్యశ్రీ కూడా నోచుకోవడం లేదు అంతరించిపోతున్న సంచారగాతులపై ప్రత్యేక కథనం...

సమాజంలో అత్యంత దుర్భర జీవనం గడుపుతున్న వెనుకబడిన తరగతుల్లో అత్యంత వెనుకబడిన కులాలకు చెందినవారే సంచార జాతుల వారు.తెలంగాణ రాష్ట్రంలో సంచార అర్ధసంచార విముక్త కులాలు మొత్తంగా 42 ఉన్నాయి. తమకంటూ ఒక స్థిర నివాసం లేని ఈ కులాలు బతుకుతెరువు కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పలు రాష్ట్రాలకు వలస పోతున్నారు.

సంచారజాతులు పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా పట్టణ ప్రాంత శివారులలో చిన్నచిన్న గుడారాలు, గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నాయి. ఒక ప్రదేశంలో 15 లేదా 20 రోజులకు మించి ఉండకుండా భుక్తిని వెతుక్కుంటూ నిరంతరం సంచారిస్తారు. పాము, తేలు తదితర మంత్రగాళ్లు, ఆయుర్వేద వైద్యులు, గారడీ చేసేవారు, విన్యాసాలు చేసేవారు, నటులు, కథకులు, జంతు వైద్యులు, పచ్చబొట్లు వేసేవారు, రోళ్లు తయారీదారులు హ, బుట్టల అల్లకం ఇలాంటి పనులతో పాటు యాచక వృత్తిని ప్రధానంగా చేసుకుని జీవనం గడుపుతుంటారు. రవాణా, పరిశ్రమలు, ఉత్పత్తి, వినోదం, పంపిణీ వ్యవస్థలలో తీవ్రమైన మార్పుల కారణంగా వారు తమ జీవనోపాధిని కోల్పోయారు. కలలు అంతరిస్తూ కటిక దుర్భర జీవితంలో సంచార గత బతుకుతున్నారు తమ పిల్లలు చదివించుకోలేక చదువుకుంటున్న పిల్లలకు రెవెన్యూ కార్యాలయంలో కుల సర్టిఫికెట్ ఇవ్వక ఇబ్బంది పడుతున్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ఏ సంక్షేమ పథకాలు వీరు దరిచెరువు 400 కోట్ల నిధులను కేటాయించామని చేశామని చెప్తున్న ప్రభుత్వాలు అందులో 10 శాతం కూడా ఖర్చు పెట్టడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే తెలంగాణ మొట్టమొదటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు సంచర జాతులు ఎక్కడ నివసిస్తుంటే అక్కడే వారి ఇల్లు ఆధార్ కార్డ్ రేషన్ కార్డు ఇస్తామని హామీ ఇచ్చారు. తప్ప అది అమలుకు నోచుకోలేదు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా వీరిపై ప్రణాళికలు ఎలాంటి చెప్పటం లేదు. గతంలో కేంద్రంలో ఉన్న వాజ్పే ప్రభుత్వం సంచార జీతులపై సర్వే నిర్వహించింది. నేటి కేంద్ర ప్రభుత్వం వీరి అన్ని విధాలు ఆదుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆమె ఇచ్చినందుకు నోచుకోలేదు.

**నేరస్తుల ముద్ర వేసిన బ్రిటిషర్లు**

నేడు సంచార జాతులుగా వ్యవహరిస్తున్నవారు రాజుల కాలంలో బాగానే బతికేవారు. కథలు వినాలన్నా, తోలుబొమ్మలాటలు చూడాలన్నా, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలన్నా రాజులు సంచార జాతులను పిలిపించుకొని వారిచేత నాటకాలు వేయించుకొని ఉల్లాసాన్ని పొందేవారు. గుళ్లు, ఇళ్లు, చెరువులు, బావులు, కోటలు కట్టేవారు. ఆ రోజుల్లో వీరికి ఎంతో గౌరవం ఉండేదని చరిత్ర చెబుతోంది. అయితే బ్రిటిష్ వాళ్ల కాలంలో సంచార జాతులకు కష్టాలువచ్చాయి. ముస్లిం పాలకులు, బ్రిటిష్ పాలనా సంస్కరణల్లో భాగంగా రైతాంగం పన్నులు చెల్లించలేక పలు ఇబ్బందులు పడ్డారు. ఆహార ఉత్పత్తిలో అధికభాగం నాటి పాలకులకు శిస్తు రూపంలో చెల్లించేందుకే సరిపోయే. వ్యవసాయ పనులు మందగించి ఎవరికీ పనులు లేకుండా పోయాయి. పనులే ప్రధానంగా గల సంచార జాతులకు పనులు లేకుండా పోయాయి. ఏ గ్రామానికి వెళ్లినా గుప్పెడు అన్నం దొరకని పరిస్థితి. ఆకలికి ఆగలేకపోయేవారు. చిన్న పిల్లల కడుపు నిపేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో చిన్న చిన్న దొంగత నాలు చేయడం మొదలు పెట్టారు. బ్రిటిష్ వారు ఇలాంటి వారికి 'క్రిమినల్ ట్రైబ్స్ 'అని పేరు పెట్టారు.

స్థిరపడిన సమాజానికి 'ముప్పు' కలిగించే సమూహాల పేరుతో జాబితా చేసి, 1871లో క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ అనే చట్టాన్ని ప్రవేశపెట్టారు. దీని ఫలితంగా దేశంలో అటువంటివి దాదాపు 200 సంఘాలను నేరస్థులుగా 'నోటిపై' చేశారు. ఒకరు, ఇద్దరు దొంగతనాలకు పాల్పడినా సంచార జాతులన్నిటికీ నిందితులుగా పేరు పడిపోయింది. ఇది భరించలేని సంచార జాతుల వారు చాలాసార్లు బ్రిటీష్ వారిపై దాడులు చేశారు. పోలీసులు వీరిపై లెక్కలేనన్ని కేసులు పెట్టి వేధించేవారు. చావకొట్టేవారు.

పలువురు సంఘసంస్కర్తల కృషివల్ల, స్వాతంత్ర్యం వచ్చాక 'క్రిమినల్ ట్రైబ్స్' పరిస్థితిపై 1948లో అయ్యంగారి కమిషన్ వేశారు. వారి పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఆ పేరు (క్రిమినల్ ట్రైబ్స్' మార్చాలని అయ్యంగార్ ప్రభుత్వానికి సూచించారు. దాంతో 1952 ఆగస్టు 31న 'నేరస్తుల జాతుల' చట్టాన్ని రద్దు చేశారు. వీరిని ఎస్టీ జాబితాలో చేర్చాలని పలు వినతులు వచ్చినా నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకోలేదు. 1970 దశకంలో లంబాడ, ఎరుకల కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారు. మిగతా కులాలను వదిలేశారు.1980లో వీరంతా బీసీలు అయిపోయారు.

ఏళ్లు గడుస్తూనే ఉన్నాయి. అనేక కమిటీలు సంచారజాతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేశాయి. 2004లో జస్టిస్ మోతిలాల్ రాథోడ్ అధ్యక్షతన జాతీయ కమిషన్‌ను అప్పటి కేందప్రభుత్వం వేసింది. 2006 లో మహారాష్ట్రకు చెందిన జస్టిస్ బాలకృష్ణ రేణకే అధ్యక్షతన రెండో కమిటీని యూపీఏ ప్రభుత్వం వేసింది. ఆ కమిటీ దేశవ్యాప్తంగా తిరిగి ఆయా జాతుల స్థితిగతులపై అధ్యయనం చేసింది. వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు 76 సిఫార్సులతో అప్పటి (2008) ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు నివేదిక సమర్పించింది. అయితే ఆ కమిషన్ సిఫార్సులను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోలేదు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వమైనా సంచార జాతుల జీవనాన్ని మెరుగుపరిచేలా బాలకృష్ణ రేణకే కమిటీ సిఫార్సులను అమలు పర్చాల్సిన అవసర ముంది.

గంగిరెద్దుల, దొమ్మర్ల, పంబల,బాలసంతు, బండార, బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెద్దుల, జంగం, జోగి, కాటికాపరి, కొర్చ, మొండివారు, పిచ్చిగుంట్ల, పాముల, పార్ధి, పంబల, దమ్మాలి, వీరముష్టి, గూడల, కంజార, కాప్మారే, మొండిపట్ట, నొక్కార్, పరికి, మగ్గుల, యాట, చోపేమారి, కైకాడి, జోషినందివాలా, మందుల, కునపులి, పత్రా, రాజనాల, కాసికపాడి జాతులు, సంచార జాతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి... సంఘం రాష్ట్ర కార్యదర్శి ఒంటెద్దు నరేందర్

సంచార జాతులు మొత్తం 64 కులాలు. ఇందులో బీసీలు 50, ఎస్సీలలో 10, ఎస్టిలో నాలుగు కులాలు ఉన్నాయి. ఎస్సీ ఎస్టీలలో కొంత మెరుగుపడిన బీసీల్లో మాత్రం అనేక ఇబ్బంది పడుతున్నారు. వీరిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి చేతివృత్తుల, కలలు అంతరిచిపోతున్నందున చేయడానికి పన్ను లేక అనేక ఇబ్బంది పడుతున్నాము. నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీరు పోరాడినందున మాపై నీరసంగా నాటి ప్రభుత్వ ముద్ర వేసింది స్వతంత్రం వచ్చిన ఈ ప్రభుత్వం మమ్మల్ని గుర్తించడం లేదు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి.

**స్థిర నివాసాలు ఏర్పాటు చేసి అందించాలి.**

నాటి కెసిఆర్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలించిన ఈ జాతర ఆదుకోలేదు ఈ జాతను ఆదుకోలేదు అంతరించిపోతున్న జాతరను అన్ని విధాలుగా ఆదుకోవాలి 400 కోట్లు కేటాయిస్తున్నామని చెప్తున్నాడు తప్ప ఆ నిధులు ఖర్చు చేయడం లేదు.






ఎం రవీందర్ సీనియర్ జర్నలిస్ట్
7901503777

# కమర్షియల్ కొరత... డొమెస్టిక్ దందా

- **లెక్కలు ఒకలా... వినియోగం మరోలా**
- **5 వేల హోటళ్లకు 2,717 కనెక్షన్లే**
- **యదేచ్ఛంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో డొమెస్టిక్ వినియోగం**
- **ఏజెన్సీల పర్యవేక్షణపై సందేహాలు**
- **స్పష్టత లేని సీఎస్ఆర్ కనెక్షన్లు**
- **ధర తేడాతో దుర్వినియోగం ఈకేవైసీ అమల్లో నిర్లక్ష్యం**
- **ప్రక్షాళన కోరుతున్న ప్రజలు**

**కరీంనగర్, మార్చి 24(ప్రజాక్షేత్రం):**

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల గణాంకాలు, వాస్తవ వినియోగం మధ్య తేడాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అధికారిక లెక్కలు ఒక విధంగా ఉన్నప్పటికీ నేలమీద పరిస్థితి మరోలా ఉన్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 4,69,101 గ్యాస్ కనెక్షన్లు ఉన్నప్పటికీ అందులో 4,66,384 డొమెస్టిక్ కనెక్షన్లే ఉండటం గమనార్హం. ఇదే సమయంలో కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు కేవలం 2,717 మాత్రమే ఉండటం అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో 5,000కు పైగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ లెక్కలు డొమెస్టిక్ గ్యాస్ వినియోగం వ్యాపార అవసరాలకు మళ్లుతున్నట్లు స్పష్టతనిస్తున్నాయి. మరోవైపు జనరల్ కనెక్షన్లు 3,39,753గా ఉండగా, దీపం కింద 66,698, ఉజ్వల కింద 31,317 కనెక్షన్లు నమోదయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు 628 కనెక్షన్లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. సీఎస్ఆర్ కింద 27,454 కనెక్షన్లు ఉన్నట్లు చూపుతున్నప్పటికీ అవి ఎవరికి చేరుతున్నాయి, ఎక్కడ వినియోగంలో ఉన్నాయి అన్న అంశాలపై స్పష్టత లేకపోవడంతో వ్యవస్థ పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఏజెన్సీలు పుష్కలం... పర్యవేక్షణ శూన్యం?**

జిల్లాలో మొత్తం 23 గ్యాస్ ఏజెన్సీలు పనిచేస్తుండగా హెచ్పీసీఎల్ 9, ఐవోసీఎల్ 6, బీపీసీఎల్ 8 ఉన్నాయి. అన్ని కంపెనీలు ఉన్నప్పటికీ కనెక్షన్ల జారీ, వినియోగంపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ కనిపించకపోవడం ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇదే సమయంలో పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కమర్షియల్ గ్యాస్ సరఫరా కఠినమైనప్పటికీ జిల్లాలో ఫుడ్ వ్యాపారం పెద్దగా దెబ్బతినలేదు. సుమారు 20 శాతం వ్యాపారాలు మాత్రమే ఇబ్బందులు ఎదుర్కొనగా మిగతా 80 శాతం యథావిధిగా కొనసాగుతున్నాయి. అధికారులు చేసిన అంచనాల్లోనే అసలు పరిస్థితి స్పష్టమవుతోంది హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, దాబాలు, ప్రైవేట్ హాస్టళ్లలో విస్తృతంగా డొమెస్టిక్ గ్యాస్ వినియోగమే కొనసాగుతోన్నట్లు స్పష్టం అవుతుంది. జిల్లాలో సుమారు 7,000 వరకు ఆహార వ్యాపార కేంద్రాలు ఉన్నట్లు అంచనా ఉన్నా కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు మాత్రం 2,717కే పరిమితం కావడం గమనార్హం. ఈ లెక్కన మిగతా వేలాది వ్యాపారాలు ఏ గ్యాస్‌తో నడుస్తున్నాయి అన్న ప్రశ్న యంత్రాంగంపై ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

**డొమెస్టిక్ గ్యాస్‌తోనే వ్యాపారం..?**

వ్యాపార అవసరాలకు కమర్షియల్ గ్యాస్ తప్పనిసరి అయినప్పటికీ జిల్లాలో వాస్తవ పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. కరీంనగర్‌తో పాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, గంగాధర, మానకొండూరు తదితర మండలాల్లో విస్తృతంగా డొమెస్టిక్ సిలిండర్ల వినియోగమే కొనసాగుతోంది. ట్రేడ్ లైసెన్సులు ఉన్న సంస్థలకే కమర్షియల్ కనెక్షన్లు లేకపోవడం పర్యవేక్షణ బహిర్గతం చేస్తోంది. మరోవైపు 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్న కుటుంబాల కంటే జిల్లాలో సుమారు 1.70 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఎక్కువగా ఉండటం గ్యాస్ పంపిణీ వ్యవస్థపై అనుమానాలను పెంచుతోంది. సీఎస్ఆర్ కింద ఉన్న 27,454 కనెక్షన్లు ఎవరికి చేరాయి, ఎలా వినియోగంలో ఉన్నాయి అన్న విషయంపై స్పష్టత లేకపోవడం గమనార్హం. డొమెస్టిక్ సిలిండర్ ధర సబ్సిడీతో తక్కువగా (సుమారు రూ.984) ఉండగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.2,145 వరకు ఉండటం దుర్వినియోగానికి కారణమవుతున్నట్లు తెలుస్తుంది. కొంతమంది ఏజెన్సీలు నిబంధనలు పక్కనబెట్టి కనెక్షన్లు జారీ చేశాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నిర్లక్ష్యంగా ఈకేవైసీ**

జిల్లాలో ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ సగానికి పైగా గ్యాస్ కనెక్షన్లు పూర్తి కాలేదని తెలుస్తున్న సమాచారం. అయినప్పటికీ సంబంధిత యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే సబ్సిడీ గ్యాస్ దుర్వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో గ్యాస్ వినియోగంపై సమగ్ర ప్రక్షాళన అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సబ్సిడీ గ్యాస్ నిజంగా అర్హులకు చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే కలెక్టర్ స్థాయిలో జోక్యం చేసుకుని వ్యవస్థను సరిదిద్దాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.






# లాకప్ డెత్ కేసులో 10 డిమాండ్లు డీజీపీతో మంద కృష్ణ మాదిగ భేటీ

**హైదరాబాద్ మార్చి 24(ప్రజాక్షేత్రం):**

కర్ల రాజేష్ లాకప్ డెత్ కు ప్రధాన కారకుడు, చిలుకూరు పోలీస్ స్టేషన్ కు అధికారిగా ఉన్న సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలి. ప్రస్తుతం కర్ల రాజేష్ లాకప్ డెత్ పై కొనసాగుతున్నటువంటి విచారణను వేగవంతం చేసి తక్షణమే దర్యాప్తును పూర్తి చేయాలి. కర్ల రాజేష్ మృతదేహం ఇంటి వద్ద ఉండగానే తేది 1811 2025 రోజున రాజేష్ మరణానికి కారకులైన ఎస్ఐ, సీఐల మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఆనాటి కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి కి కర్ల రాజేష్ తల్లిగారైన కర్ల లలిత ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదు తీసుకోకుండా మీరు రాసుకొని వచ్చిన పిర్యాదు కాకుండా నేను సూచించిన విధంగానే ఫిర్యాదు రాయాలని, లేకుంటే పిర్యాదు తీసుకోనని కర్ల లలిత ఇచ్చిన ఫిర్యాదును తిరస్కరించి విధి నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం చేశారు. కోదాడ నూతన డిఎస్పీగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్ రెడ్డి కి తేది 3011 2025 న కర్ల లలిత లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే దానిపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇద్దరు డీఎస్పీలు నిర్లక్ష్యం చేసిన తరువాత తేది: 9122025 రోజున సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా కి కర్ల లలితమ్మ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేయకుండా, చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయకుండా, చట్టపరమైన చర్యలు తీసుకోకుండా పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పోలీసు అధికారులపై (కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి, ఆ తర్వాత వచ్చిన డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి అలాగే సూర్యపేట జిల్లా ఎస్పీ నరసింహా ) ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ లోని సెక్షన్ 4 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394